# 33. అల్ అహ్‌జాబ్ (కూటమి) సూరా

## పరిచయం

ఈ సూరా మదీనా కాలంలో అవతరించిన సూరా. ఇందులో 73 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా అనేక ఇస్లామీయ చట్టాలను తెలిపింది. ముఖ్యంగా కుటుంబానికి సంబంధించిన చట్టాలు ఇందులో వచ్చాయి. ఈ సూరాలోని 20వ ఆయతులో కూటమి గురించిన ప్రస్తావన ఉంది. ఈ ప్రస్తావన ఆధారంగా దీనికి ఈ పేరు పెట్టడం జరిగింది. క్రీ.శ 626–27లో మక్కా నగరానికి చెందిన అవిశ్వాసులు, యూదులు, కపటవిశ్వాసులు ఒక కూటమిగా ఏర్పడ్డారు. మదీనాలో కొత్తగా ఏర్పడిన ఇస్లామీయ సమాజాన్ని తుడిచివేయాలని భావించారు. 10,000 మంది సైనికులతో మదీనాను మూడువారాల పాటు చుట్టుముట్టారు. ఈ ముట్టడి సైనికపరమైనదే కాదు, ఆర్థికమైనది కూడా. ఈ ముట్టడి వల్ల ముస్లిములు చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చింది. ముస్లిములు మదీనా చుట్టూ శత్రువులు ప్రవేశించకుండా ఒక కందకాన్ని తవ్వారు. ఈ కందకం శత్రువులను లోనికి ప్రవేశించకుండా అడ్డుపడింది. ఒక బలమైన గాలి వాన శత్రు శిబిరాలను కకావికలు చేసింది. మూడురోజుల పాటు వీచిన ఈ గాలివానకు శత్రు కూటమి సైన్యాలు పలాయనం చిత్తగించాయి.

ఈ సూరాలో కుటుంబపరమైన మర్యాదల ప్రస్తావన ఉంది. ఈ మర్యాదలను అందరూ గౌరవించాలి. పరుల ఇంటిలోకి వారి అనుమతి లేనిదే ప్రవేశించరాదు. ఎవరైనా భోజనానికి పిలిస్తే, సమయానికి చాలా ముందే అక్కడి వెళ్ళి ఇబ్బంది కలిగించరాదు. భోజనం ముగిసిన తర్వాత వ్యర్ధప్రసంగాలతో అక్కడే కాలం వెళ్ళబుస్తూ కూర్చోరాదు. ఈ సూరాలో తీర్పుదినం నాటి భయంకర పరిస్థితుల ప్రస్తావన వచ్చింది. అవిశ్వాసుల కొరకు భయానకమైన అగ్ని సిద్ధంగా ఉందని హెచ్చరించింది.

## 33. అల్ అహ్జాబ్ సూరా

سُورَةُ الأَحْزَابِ

అవతరణ :మదీనా ఆయతులు : 73

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

**1** ఓ ప్రవక్తా! అల్లాహ్‌కు భయపడుతూ ఉండు.[1] అవిశ్వాసులకు, కపటులకు విధేయత చూపకు. నిశ్చయంగా అల్లాహ్‌యే మహా జ్ఞాని, మహా వివేకి.[2]

يٰۤاَيُّهَا النَّبِيُّ اتَّقِ اللّٰهَ وَلَا تُطِعِ الْكٰفِرِيْنَ وَالْمُنٰفِقِيْنَ ؕ اِنَّ اللّٰهَ كَانَ عَلِيْمًا حَكِيْمًا ۙ﴿۱﴾

**2** నీ ప్రభువు తరఫు నుంచి నీవద్దకు వచ్చే వహీని[3] అనుసరిస్తూ ఉండు. మీరు చేసే ప్రతి పనీ అల్లాహ్‌కు బాగా తెలుసు.[4]

وَّاتَّبِعْ مَا يُوْحٰۤى اِلَيْكَ مِنْ رَّبِّكَ ؕ اِنَّ اللّٰهَ كَانَ بِمَا تَعْمَلُوْنَ خَبِيْرًا ۙ﴿۲﴾

**3** నువ్వు అల్లాహ్‌ను మాత్రమే నమ్ముకో.[5] కార్యసిద్ధికి అల్లాహ్ ఒక్కడే చాలు.[6]

وَّتَوَكَّلْ عَلَى اللّٰهِ ؕ وَكَفٰى بِاللّٰهِ وَكِيْلًا ﴿۳﴾

1. ఈ ఆయతులో దైవప్రవక్త (స)కు దేవుని తరఫున హితబోధ చేయబడింది. ఎట్టి పరిస్థితిలోనూ అల్లాహ్‌కు భయపడుతూ, ధర్మవ్యాప్తికి పాటుపడాలని ఉపదేశించబడింది. దేవుడు సూచించినట్లుగా దైవానికి విధేయత చూపుతూ, ఆయన నుంచి పుణ్యఫలాన్ని ఆశిస్తూ, దేవుడు వారించిన విషయాలను పరిత్యజిస్తూ, దేవుని ఆగ్రహానికి, శిక్షకు భయపడుతూ జీవితం గడపటమే భయభక్తులు (తఖ్వా) అని తలఖ్ బిన్ హబీబ్ వక్కాణించారు (ఇబ్నె కసీర్).
2. కాబట్టి భయభక్తులతో మెలగటానికి, విధేయత చూపటానికి అల్లాహ్ మాత్రమే అర్హుడు. ఎందుకంటే పరిణామం గురించి తెలిసినవాడు ఆయన మాత్రమే. ఆయన వచనాలు, ఆయన పనులు అన్నీ యుక్తితో, పరమార్థంతో కూడుకున్నవి.
3. అంటే దివ్య ఖుర్ఆన్‌తో పాటు, హదీసులను కూడా అనుసరించాల్సిందే. హదీసులు మహాప్రవక్త (సఅసం) నోట వెలువడినవే అయినప్పటికీ వాస్తవానికి అవి భావం రీత్యా అల్లాహ్ తరఫునుండి జారీ అయినవే. అందుకనే వాటిని **'వహీ ఖఫీ'** లేక 'వహీయె గైర్ మత్‌లూ'గా పిలవటం జరిగింది.
4. ఆయన నుండి ఏ మాటా, ఏ చేష్టా దాగిలేదు. కనుక మాటల్లోగానీ, చేతల్లోగానీ అడుగడుగునా అల్లాహ్ మిమ్మల్ని గమనిస్తున్నాడన్న విషయాన్ని తెలుసుకుని మరీ మసలుకోండి.
5. నీ సమస్త వ్యవహారాలలో, సర్వకాల సర్వావస్థలలో అల్లాహ్‌పైనే భరోసా చేయాలి.

مَا جَعَلَ اللّٰهُ لِرَجُلٍ مِّنْ قَلْبَيْنِ فِي جَوْفِهٖ ۚ وَمَا جَعَلَ اَزْوَاجَكُمُ الّٰٓـِٔيْ تُظٰهِرُوْنَ مِنْهُنَّ اُمَّهٰتِكُمْ ۚ وَمَا جَعَلَ اَدْعِيَآءَكُمْ اَبْنَآءَكُمْ ۚ

**4** ఏ మనిషి శరీరంలోనూ అల్లాహ్ రెండు హృదయాలను ఉంచలేదు.[7] మీరు మీ భార్యల్లో ఎవరినయినా మీ తల్లులుగా ప్రకటించినంత మాత్రాన అల్లాహ్ వారిని (నిజంగానే) మీ తల్లులుగా చేయలేదు.[8] మీ దత్తపుత్రులను కూడా మీ (కన్న) కొడుకులుగా చేయలేదు.[9] ఇవన్నీ మీ

6. తనను నమ్ముకున్నవారి, తన వైపుకు రుజువర్తనులైనవారి కార్యాలను ఆయన చక్కదిద్దుతాడు.

7. కొన్ని ఉల్లేఖనాల ప్రకారం ఆ కాలంలో ఒక నయవంచకుడు (మునాఫిఖ్) తనకు రెండు హృదయాలున్నాయని, ఒక హృదయం ముస్లిముల వెంట ఉంటే, మరో హృదయం అవిశ్వాసుల వెంట ఉంటుందని చెప్పుకునేవాడు (ముస్నదె అహ్మద్ – 1/267). అతని బూటకపు ప్రకటనను ఖండిస్తూ ఈ ఆయతు అవతరించింది. దీనిభావం ఏమిటంటే ఒక వ్యక్తి లోపల రెండు హృదయాలు ఉండటం, ఆ రెండింటిలో ఒకదానిలో దైవప్రేమ, మరో దానిలో దైవవిరోధుల పట్ల విధేయతా భావం ఉండటం అసంభవం.

మరి కొంతమంది కథనం ప్రకారం మక్కాలోని బహుదైవారాధకులలో జమీల్ బిన్ మామూర్ ఫిహ్రీ అనే వ్యక్తి ఒకడుండేవాడు. ఆ మాయలమారి తన మాటలతో జనులను ఇట్టే బోల్తా కొట్టించేవాడు. తాను ఒకే సమయంలో రెండు హృదయాలతో ఆలోచిస్తానని, ముహమ్మద్ (స)కు ఒక హృదయం మాత్రమే ఉన్నదని బుకాయించేవాడు. అతని ధోరణిని ఖండిస్తూ ఈ ఆయతు అవతరించింది (ఐసరుత్తఫాసీర్).

ఇంకా కొంతమంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు ఇలా అభిప్రాయపడ్డారు : రాబోయే రెండు ధర్మసందేహాల నివృత్తికి ఉపోద్ఘాతం వంటిది ఈ వాక్యం. అంటే – ఏ విధంగానయితే ఒక వ్యక్తి శరీరంలో రెండు హృదయాలుండవో అదేవిధంగా ఎవరైనా తన భార్యను తల్లిగా ప్రకటించినంతమాత్రాన ఆమె అతని కన్నతల్లి అయిపోదు. ఆ విధంగా అతనికి రెండు తల్లులు ఉండబోరు. అలాగే ఒక వ్యక్తి ఎవరినయినా దత్తపుత్రునిగా చేసుకున్నంత మాత్రాన ఆ అబ్బాయి అతని కన్న కొడుకు అయిపోడు. నిజానికి అతను అతన్ని కన్న తండ్రికే చెందుతాడు." (ఇబ్నె కసీర్)

8. దీనినే **'జిహార్'** (ظِهَار) అంటారు. దీనికి సంబంధించిన వివరాలు ముజాదలా సూరాలో రానున్నాయి.

9. దత్తపుత్రునికి సంబంధించిన ధర్మసందేహాల నివృత్తి ఈ సూరాలో ముస్ముందు రాబోతోంది.

ذَٰلِكُمْ قَوْلُكُم بِأَفْوَاهِكُمْ ۖ وَاللَّهُ يَقُولُ الْحَقَّ وَهُوَ يَهْدِي السَّبِيلَ ④

నోటిమాటలే.[10] అల్లాహ్ సత్యం పలుకుతున్నాడు.[11] ఆయన (రుజు) మార్గం చూపుతున్నాడు.

ادْعُوهُمْ لِآبَائِهِمْ هُوَ أَقْسَطُ عِندَ اللَّهِ ۚ فَإِن لَّمْ تَعْلَمُوا آبَاءَهُمْ فَإِخْوَانُكُمْ فِي الدِّينِ وَمَوَالِيكُمْ ۚ وَلَيْسَ عَلَيْكُمْ

**5** దత్తపుత్రులను వారి (కన్న) తండ్రుల సంబంధంతోనే పిలవండి. అల్లాహ్ దృష్టిలో ఇదే న్యాయం.[12] ఒకవేళ వారి (కన్న) తండ్రులెవరో మీకు తెలీకపోతే, అట్టి పరిస్థితిలో వారు మీ ధార్మిక సోదరులు, స్నేహితులు[13] అవుతారు. మరుపు

మూలంలో **'అద్‌యియా'** (أَدْعِيَاء) అని ఉంది. అది 'దయియ్యున్'కు బహువచనం. దత్తపుత్రులు అని దీని అర్థం.

10. ఏ స్త్రీనయినా (భార్యనయినా) 'నువ్వు నా తల్లివి' అని భర్త నోరు జారినంత మాత్రాన ఆమె అతని కన్నతల్లి అయిపోదు. అలాగే దారినపోయే ఏ దానయ్యనయినా పట్టుకుని దత్తపుత్రునిగా (పెంపుడు కొడుకుగా) చేసుకున్నంత మాత్రాన అతను సొంత కొడుకు కాజాలడు. తల్లికి, కన్న కుమారునికి సంబంధించిన షరీఅత్‌పరమైన వ్యవహారాలు వారికి వర్తించవు.

11. కాబట్టి మీరు దైవాదేశాలను మాత్రమే పాటించాలి. మీకిష్టం వచ్చిన వారిని తల్లులుగా ప్రకటించుకోవటంగానీ, కొడుకులుగా చేసుకోవటంగానీ చెల్లనేరదు. ఎవరినయినా ప్రేమతో 'కుమారుడా!' అని పిలవటం వేరు. కన్నకొడుకులా ప్రకటించటం వేరు. మొదటిది సమ్మతమే. రెండవది మాత్రం ధర్మసమ్మతం కాదు.

12. ఈ ఆజ్ఞ ద్వారా అజ్ఞాన కాలం నుంచి కొనసాగుతూ వస్తున్న, ఇస్లాం తొలికాలంలో కూడా ఉన్న, పెంపుడు కొడుకును కన్నకొడుకుగా భావించే ఆచారం నిషేధించబడింది. మహాప్రవక్త ప్రియసహచరులు (రజి) ఇలా అంటున్నారు : "మేము జైద్ బిన్ హారిసను (దైవప్రవక్త ఈయనగారిని బానిసత్వం నుంచి విముక్తిని కలిగించి తన కొడుకుగా చేసుకోవటంచేత) జైద్ బిన్ ముహమ్మద్ (ముహమ్మద్ కుమారుడైన జైద్) అని పిలిచేవాళ్ళం. ఖుర్ఆన్‌లోని ఈ ఆయతు అవతరించే వరకూ ఇలాగే పిలిచేవారం" (సహీహ్ బుఖారీ – తఫ్సీర్ సూరతుల్ అహ్జాబ్). ఈ ఆయతు అవతరించిన తరువాత హజ్రత్ హుజైఫా (రజి) ఇంట్లో కూడా ఒక సమస్య ఎదురయింది. ఆయనగారు అప్పటికే హజ్రత్ సాలిమ్‌ను తన కొడుకుగా చేసుకుని ఉన్నారు. పెంపుడు కొడుకు కన్నకొడుకు కాజాలడని చెప్పబడిన తరువాత అతనితో ఆ ఇంటి ఆడవారు పరదా పాటించవలసిన ఆవశ్యకత ఏర్పడింది. అప్పుడు దైవప్రవక్త (సఅసం) హుజైఫా

جُنَاحٌ فِيْمَا أَخْطَأْتُمْ بِهٖ وَلٰكِنْ مَّا تَعَمَّدَتْ قُلُوْبُكُمْ ۚ وَكَانَ اللّٰهُ غَفُوْرًا رَّحِيْمًا ۝

వల్ల మీచేత ఏదన్నా (తప్పు) జరిగిపోతే దాని పాపం మీపై ఉండదు.[14] అయితే హృదయపూర్వకంగా చేసినపక్షంలో అది పాపమే.[15] అల్లాహ్ అపారంగా క్షమించే వాడు, అమితంగా కనికరించేవాడు.

اَلنَّبِيُّ أَوْلٰى بِالْمُؤْمِنِيْنَ مِنْ أَنْفُسِهِمْ وَأَزْوَاجُهٗٓ أُمَّهٰتُهُمْ ۗ

**6** దైవ ప్రవక్తకు విశ్వాసులపై స్వయంగా వారి ఆత్మలకన్నా ఎక్కువ హక్కు ఉంది.[16]

భార్యనుద్దేశించి, "అతనికి (సాలిమ్‌కు) పాలు త్రాగించి, అతన్ని పాలవరుస కొడుకుగా చేసుకో" అని సూచించారు. ఆ విధంగా సాలిమ్ ఆమె కొరకు పాల వరస కొడుకు అయ్యారు (సహీహ్ ముస్లిం – కితాబుర్రజా, అబూదావూద్ – కితాబున్నికాహ్).

13. అంటే పెంపుడు కొడుకుల కన్న తండ్రులెవరో మీకు తెలిసివుంటే సమస్యే లేదు. కాని వారి తండ్రులెవరో మీకు తెలియనిపక్షంలో వారిని మీ ధార్మిక సోదరులుగా, మిత్రులుగా తలపోయండి. అంతేగాని, వారిని కుమారులుగా భావించరాదు.

14. ఎందుకంటే, – హదీసులో కూడా తెలుపబడినట్లు – మరుపు వల్ల జరిగిన పొరబాట్లపై నిలదీయటం జరగదు. అవి క్షంతవ్యమే.

15. కాని ఎవరయినా బుద్ధిపూర్వకంగా పెంపుడు కొడుకుల్ని కన్నకొడుకుగా పిలిస్తే మటుకు అది ముమ్మాటికీ తప్పే. పాపమే. హదీసులో ఇలా ఉంది – "ఎవరయితే ఉద్దేశ్యపూర్వకంగా తండ్రికాని వారిని తన తండ్రిగా పేర్కొన్నారో వారు ధిక్కారానికి (కుఫ్ర్‌కు) ఒడిగట్టారు" (సహీహ్ బుఖారీ – కితాబుల్ మనాఖిబ్).

16. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన అనుచర సమాజం శ్రేయాన్ని ఎంతగా అభిలషించేవారో, వారిపై ఆయన ఎంతటి వాత్సల్యాన్ని కురిపించేవారో జగద్విదితమే. ఆయన (సఅసం) గారి ఈ శ్రేయోభిలాషను, ప్రేమానురాగాలను చూస్తూ దేవుడు ఈ ఆయతులో దైవప్రవక్త (స)కు విశ్వాసులపై గల హక్కును నొక్కి చెప్పాడు. విశ్వాసులు లోకంలో అందరికన్నా ఎక్కువగా దైవప్రవక్త (స)ను ప్రేమించాలి. తమ కోర్కెలన్నింటిపై వారు దైవప్రవక్తకు ప్రాధాన్యతనివ్వాలి. దైవప్రవక్త (స) వారినుంచి దైవ మార్గంలో ఎప్పుడు ఏది ఆశించినా వారు సంతోషంగా సమర్పించుకోవాలి. వారు తమ జీవనావసరాల గురించి అదేపనిగా ఆలోచించాల్సిన అవసరం లేదు. వారు తమ ప్రాణాలకన్నా ఎక్కువగా దైవప్రవక్త (స)ను ప్రేమించాలి. ఆయన (స) ఆజ్ఞను ప్రప్రథమంగా నిర్వర్తించాలి. ఆయన (స) విధేయతను అన్నింటికన్నా ముఖ్యమైన విధిగా భావించాలి. "వారు తమ పరస్పర విభేదాల విషయంలో ఆయన్ని (స) న్యాయనిర్ణేతగా స్వీకరించనంతవరకూ, ఆయన ఏ నిర్ణయం చేసినా దానిని గురించి

وَاُولُوا الْاَرْحَامِ بَعْضُهُمْ اَوْلٰى بِبَعْضٍ فِيْ كِتٰبِ اللّٰهِ مِنَ
الْمُؤْمِنِيْنَ وَالْمُهٰجِرِيْنَ اِلَّآ اَنْ تَفْعَلُوْٓا اِلٰٓى اَوْلِيٰٓئِكُمْ مَّعْرُوْفًا
كَانَ ذٰلِكَ فِي الْكِتٰبِ مَسْطُوْرًا ۝

అతని భార్యలు విశ్వాసుల కొరకు తల్లులు.[17] మరి దైవగ్రంథం ప్రకారం రక్తసంబంధీకులు ఇతర విశ్వాసుల, ముహాజిర్లకన్నా పరస్పరం ఎక్కువ హక్కుదారులు.[18] ఒకవేళ మీరు మీ స్నేహితుల యెడల సద్వ్యవహారం (ఏదన్నా) చేయదలిస్తే అది వేరే విషయం.[19] ఈ ఉత్తర్వు (దైవ) గ్రంథంలో లిఖితమై[20] ఉంది.

وَاِذْ اَخَذْنَا مِنَ النَّبِيّٖنَ مِيْثَاقَهُمْ وَمِنْكَ وَمِنْ نُّوْحٍ وَّاِبْرٰهِيْمَ
وَمُوْسٰى وَعِيْسَى ابْنِ مَرْيَمَ وَاَخَذْنَا مِنْهُمْ مِّيْثَاقًا غَلِيْظًا ۝

**7** (ఆ సందర్భాన్ని జ్ఞాపకం చేసుకో) మేము ప్రవక్తలందరి నుండి వాగ్దానం తీసుకున్నాము – (ముఖ్యంగా) నీ నుండి, నూహ్ నుండి, ఇబ్రాహీం నుండి, మూసా నుండి, మర్యమ్ కుమారుడైన ఈసా నుండి. మేము వారందరి నుండి గట్టి వాగ్దానం తీసుకున్నాము[21] –

వారి మనస్సులలో లేశమైనా సంకోచం ఏర్పడకుండా దానిని యథాతథంగా శిరసావహించనంతవరకూ వారు నిజమైన విశ్వాసులు కాలేరు" (అన్ నిసా – 65 వచనం ఆధారంగా). అలాగే వారు తమ తల్లిదండ్రులకన్నా, తమ కన్నపిల్లలకన్నా ఎక్కువగా ఆయన్ని (స) ప్రేమించనంతవరకూ వారు సిసలైన విశ్వాసులు కాజాలరు. అలాగే దైవప్రవక్త (స) విధేయతలో వారి వల్ల జరిగే అలసత్వం కూడా వారి విశ్వాసాన్ని ప్రమాదంలో పడవేస్తుంది.

17. అంటే గౌరవాదరణల రీత్యా ప్రవక్త సతీమణులు విశ్వాసుల పాలిట తల్లుల వంటివారు. అలాగే విశ్వాసులు ప్రవక్త (స) సతీమణులను వివాహమాడజాలరు.

18. ఈ ఆయతు అవతరించిన తరువాత హిజ్రత్ (దైవమార్గంలో వలసపోవటం) ఆధారంగా, ధార్మిక సోదరబంధం ఆధారంగా, స్నేహబంధం ప్రాతిపదికగా వారసత్వ హక్కులు సంక్రమించవు. ఇకమీదట నిర్ణీత సమీపబంధువులు మాత్రమే ఆస్తికి వారసులవుతారు.

19. అయితే మీరు మీ స్నేహితులకు ఏదన్నా మేలు చేయదలిస్తే నిస్సంకోచంగా చేయవచ్చు. మీ ఆస్తిలో మూడోవంతు భాగాన్ని వీలు వ్రాసే అనుమతి మీకు ఉండనే ఉంది. దాన్ని ఉపయోగించుకుంటూ మీరు వారితో సద్వ్యవహారం చేయవచ్చు.

20. **'గ్రంథం'** (الْكِتٰبِ) అంటే ఇక్కడ 'లౌహె మహ్‌ఫూజ్' అన్నమాట. ప్రారంభంలో అనేక పరమార్థాల రీత్యా – ధార్మిక సంబంధాల ప్రాతిపదికపై – వారసత్వ హక్కులు

8 - అల్లాహ్ సత్యవంతులను వారి సత్యత గురించి ప్రశ్నించటానికి.[22] అవిశ్వాసుల కొరకు ఆయన బాధాకరమైన శిక్షను సిద్ధం చేసి ఉంచాడు.

لِّيَسْـَٔلَ الصّٰدِقِيْنَ عَنْ صِدْقِهِمْ ۚ وَاَعَدَّ لِلْكٰفِرِيْنَ عَذَابًا اَلِيْمًا ۝٨

9 ఓ విశ్వాసులారా! అల్లాహ్ మీపై కురిపించిన దయానుగ్రహాన్ని కాస్త జ్ఞప్తికి తెచ్చుకోండి. మీపై సైనిక దళాలు దండెత్తి వచ్చినప్పుడు మేము వాటిపై ప్రచండమైన పెనుగాలిని, మీకు కానరాని సైన్యాలను పంపాము.[23] మీరు చేస్తున్నదంతా అల్లాహ్ చూస్తూనే ఉన్నాడు.

يٰٓاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوا اذْكُرُوْا نِعْمَةَ اللّٰهِ عَلَيْكُمْ اِذْ جَآءَتْكُمْ جُنُوْدٌ فَاَرْسَلْنَا عَلَيْهِمْ رِيْحًا وَّجُنُوْدًا لَّمْ تَرَوْهَا ۚ وَكَانَ اللّٰهُ بِمَا تَعْمَلُوْنَ بَصِيْرًا ۝٩

తాత్కాలికంగా ఇవ్వబడ్డాయి. ఇది తాత్కాలిక ఏర్పాటు అన్న సంగతి అల్లాహ్‌కు కూడా తెలుసు. ధర్మసంస్థాపన జరిగిన తరువాత ఈ తాత్కాలిక స్థితిని రద్దుపరచి 'లౌహె మహ్‌ఫూజ్'లో వ్రాయబడివున్న శాశ్వత చట్టం ప్రవేశపెట్టబడింది.

21. ఇంతకీ అది ఏ వాగ్దానం? కొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం అది ఆలి ఇమ్రాన్ సూరాలోని 81వ ఆయతులో చెప్పబడినట్లు ప్రవక్తలు పరస్పరం ధృవీకరించుకోవాలి, సహకరించుకోవాలి. వారి తరువాత వచ్చే ప్రవక్తలను వారు విశ్వసించాలి.

మరి కొంతమంది అభిప్రాయం ప్రకారం ఇక్కడ వాగ్దానం అంటే షూరా సూరాలోని 13వ ఆయతులో చెప్పబడినట్లు ధర్మాన్ని నెలకొల్పాలి. ధర్మం విషయంలో చీలిక తీసుకురావద్దు. ఈ వాగ్దానం ప్రవక్తలందరి చేత తీసుకోబడినప్పటికీ ఐదుగురు ప్రవక్తల పేర్లు మాత్రం ప్రత్యేకంగా ప్రస్తావించబడ్డాయి. దీనిద్వారా వారి ప్రాముఖ్యత, ఔన్నత్యం తెలిసివస్తోంది. వారిలో కూడా మహాప్రవక్త (సఅసం) వారి పేరు అందరికన్నా ముందు వచ్చింది. మహాప్రవక్త ముహమ్మద్ (స) వారు అందరికన్నా చివరివారైనప్పటికీ ఆయన పేరు అందరికన్నా ముందు రావటాన్నిబట్టి ఆయన గొప్పతనం విదితమవు తోంది.

22. ఈ ఆయతుకు రెండు అర్థాలున్నాయి: 1. దైవ సందేశాన్ని తమ జాతి ప్రజలకు ఖచ్చితంగా అందజేశారో లేదో తన సత్యప్రవక్తలను దేవుడు ప్రశ్నించటానికి ముందు గానే ఈ వాగ్దానం తీసుకున్నాడు. లేదా 2. మీ సందేశానికి మీ జాతివారు ఎలా స్పందించారు? వారు అవునన్నారా? కాదన్నారా? అని ఆయన తన ప్రవక్తలను అడగటానికి. ఈ మాటే వేరొకచోట ఇలా చెప్పబడింది: "మేము ఎవరివద్దకు ప్రవక్త లను పంపామో వారిని లెక్క అడుగుతాము. ప్రవక్తలను కూడా అడుగుతాము" (అల్ ఆరాఫ్-6). ఈ ఆయతులో సత్యసందేశ ప్రచారకులకు కూడా హెచ్చరిక ఉంది. వారు ఈ సందేశ కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో నెరవేర్చాలి. తద్వారా వారు

**10** (శత్రువులు) మీపైకి పైతట్టునుంచీ, లోతట్టునుంచీ దండెత్తి వచ్చినప్పుడు[24] (మీరు) కళ్ళు తేలవేసినప్పుడు, (మీ)

إِذْ جَآءُوكُم مِّن فَوْقِكُمْ وَمِنْ أَسْفَلَ مِنكُمْ وَإِذْ زَاغَتِ الْأَبْصَارُ وَبَلَغَتِ الْقُلُوبُ الْحَنَاجِرَ وَتَظُنُّونَ بِاللَّهِ

దైవసన్నిధిలో సమాధానం ఇవ్వగలిగే స్థితిలో ఉంటారు. అలాగే ఈ సందేశాన్ని అందజేసినప్పటికీ దాన్ని లక్ష్యపెట్టకుండా త్రోసిపుచ్చిన వారికి ఇందులో వార్నింగ్ ఉంది. వారు దైవ సన్నిధిలో అపరాధులుగా నిలబడతారు. శిక్షార్హులౌతారు.

23. ఈ ఆయతుల ద్వారా హిజ్రీ 5వ సంవత్సరంలో జరిగిన అహ్జాబ్ యుద్ధానికి సంబంధించిన కొంత సమాచారం ఇవ్వబడింది. ఇస్లాం మరియు ముస్లింలకు బద్ధశత్రువులైన సైనిక కూటములన్నీ ఏకమై ముస్లింల కేంద్ర స్థానమైన 'మదీనా' పైకి దండెత్తి రావటం వల్ల దీనికి 'అహ్జాబ్' అనే పేరువచ్చింది. అహ్జాబ్ అనేది 'హిజ్బ్' (వర్గం లేక కూటమి) అనే పదానికి బహువచనం. ఈ యుద్ధాన్ని కందక యుద్ధంగా కూడా వ్యవహరిస్తారు. ఎందుకంటే ముస్లింలు ఈ యుద్ధ సందర్భంగా తమ ఆత్మరక్షణ కోసం మదీనా చుట్టూ కందకం త్రవ్వుకున్నారు.

సంక్షిప్తంగా దీని పూర్వాపరాలు ఇవి –

యూదుల తెగలలో ఒకటైన బనూ నజీర్ మహాప్రవక్త (స)తో చేసుకున్న మైత్రీ ఒప్పందాన్ని పదే పదే ఉల్లంఘించి, వెన్నుపోటు చర్యలకు పాల్పడుతూ ఉండటం వల్ల ఆయన (స) గారు బనూ నజీర్‌ను మదీనా నుంచి బహిష్కరించారు. దాంతో ఈ యూద తెగవారు ఖైబర్‌లో స్థిరపడ్డారు. అయితే వారు ముస్లింలపై ప్రతీకారేచ్ఛతో రగిలిపోతూ, మక్కాకు చెందిన అవిశ్వాసులను ముస్లింలపై ఉసిగొల్పారు. అలాగే నజద్ ప్రాంతానికి చెందిన గిత్ఫాన్ తదితర తెగలకు కూడా సహాయం అందజేస్తామని హామీ యిచ్చి సమరానికి సిద్ధం చేశారు. ఆ విధంగా యూదులు, ఆనాడు ముస్లింలకు విరోధులుగా ఉన్న అరబ్బు తెగలన్నింటినీ ఏకంచేసి, ఒకే సమయంలో మదీనాపై దండెత్తి వచ్చేలా తెరవెనుక పాత్రను పోషించారు.

ఆ రోజుల్లో మక్కా ముష్రిక్కులకు నాయకుడుగా ఉన్న అబూ సుఫ్యాన్ ఉహుద్ పర్వత సమీపంలో భారీ సైన్యంతో మోహరించి మదీనా నగరాన్ని దాదాపు ముట్టడించాడు. అతని దగ్గర 10 వేల మంది సైనికులున్నారు. ముస్లింల సైన్యమంతా కలిపితే 3 వేలు దాటదు. ఇదిలావుండగా మదీనాకు దక్షిణాన బనూ ఖురైజా అనే మరో యూద తెగ ఉండేది. ఈ తెగవారు అప్పటి వరకూ ముస్లింలతో చేసుకున్న ఒడంబడికకు కట్టుబడి ఉండేవారు. కాని బనూ నజీర్ తెగ నాయకుడైన హుయ్ బిన్ అఖ్తబ్ బనూ ఖురైజాను కూడా రెచ్చగొట్టి తమ పక్షాన తిప్పుకున్నాడు. ఆ విధంగా ముస్లింలు నలు దిశల నుంచీ శత్రువులచే ముట్టడించబడ్డారు.

الظُّنُونَا ⑩

గుండెలు గొంతుల దాకా వచ్చేసినప్పుడు, మీరు అల్లాహ్ విషయంలో రకరకాల అనుమానాలకు లోనయ్యారు.[25]

هُنَالِكَ ابْتُلِيَ الْمُؤْمِنُونَ وَزُلْزِلُوا زِلْزَالًا شَدِيدًا ⑪

**11** అప్పుడు విశ్వాసులు పరీక్షించబడ్డారు. తీవ్రంగా కుదిపివేయబడ్డారు.[26]

وَإِذْ يَقُولُ الْمُنَافِقُونَ وَالَّذِينَ فِي قُلُوبِهِم مَّرَضٌ مَّا وَعَدَنَا

**12** ఆ సమయంలో కపటులు, హృదయాలలో (అనుమానపు) రోగం ఉన్నవారు, "అల్లాహ్, ఆయన ప్రవక్త

ఆ సంక్లిష్ట పరిస్థితిలో హజ్రత్ సల్మాన్ ఫార్సీ (రజి) సలహాపై కందకం త్రవ్వబడింది. దాంతో శత్రు సైన్యాన్ని కందకానికి అవతలే నిలువరించటంలో ముస్లింలు కృతకృత్యులయ్యారు. అయితే ఈ దిగ్బంధం వల్ల ముస్లింలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ముస్లింలకు దిక్కు తోచని పరిస్థితి ఏర్పడింది. ఆ గడ్డు సమయంలో ఊహించని మార్గాల నుంచి అకస్మాత్తుగా అల్లాహ్ వారికి తోడ్పడ్డాడు. ఈ ఆయతులో అల్లాహ్ ఒక వైపు ముస్లింల దీనావస్థను, మరోవైపు తన అగోచర సహాయాన్ని ప్రస్తావించాడు. ఆయతులోని అరబీ పదం **'జునూదున్'** (جُنُودٌ) అంటే సైనిక వర్గాలు అని అర్థం. వివిధ తెగలకు చెందిన సైనికులంతా కలసి ఈ యుద్ధ సందర్భంగా మదీనాపై విరుచుకుపడ్డారు. **'రీహన్'** (رِيحًا) అంటే తీవ్రమైన పెనుగాలులు, ఇసుక తుఫాను. అది శత్రు సైనికుల గుడారాలను పెళ్ళగించింది. పశువులు త్రాళ్లు తెంచుకుని అటూ ఇటూ పరుగులు తీశాయి. వారి వస్తుసామగ్రి అంతా తలక్రిందులైంది. దాంతో శత్రువులు హడలెత్తిపోయి తోక ముడిచారు. ఆ పెనుగాలిని గురించే హదీసులో ఈ విధంగా అనబడింది: "తూర్పు గాలి ద్వారా నాకు సహాయం చేయబడింది. ఆద్ జాతి వారు పశ్చిమ గాలి ద్వారా అంతమొందించబడ్డారు" (సహీహ్ బుఖారీ – కితాబుల్ ఇస్తిస్ఖా; ముస్లిం – బాబు ఫీ రీహిస్సబా వద్దుబూర్). **'మీకు కానరాని సైన్యాలు'** అంటే ముస్లింల సహాయార్థం పంపబడిన దైవదూతలు అని భావం. దైవదూతలు శత్రువుల గుండెల్లో దడ పుట్టించి, అక్కణ్ణుంచి పారిపోవటంలోనే మేలుందని తలపోసేలా చేశారు.

24. అంటే, శత్రువులు నలువైపుల నుంచీ కదలివచ్చారు అని భావం. లేదా ఎగువ ప్రాంతం నుంచి గిత్ఫాన్, హవాజిన్, నజద్‌కు చెందిన ముష్రిక్కులు దండెత్తి రాగా; దిగువ ప్రాంతం నుంచి కురైషులు, వారి మిత్రవర్గాలు దండెత్తి వచ్చాయి అన్న అర్థం వస్తుంది.

25. ఆ సమయంలో ముస్లింల మానసిక పరిస్థితి ఎలా ఉందో ఈ ఆయతు ద్వారా బహిర్గతమవుతోంది.

اللّٰهُ وَرَسُولُهُۥٓ إِلَّا غُرُورًا ﴿١٢﴾

وَإِذْ قَالَت طَّآئِفَةٌ مِّنْهُمْ يَـٰٓأَهْلَ يَثْرِبَ لَا مُقَامَ لَكُمْ
فَٱرْجِعُوا۟ ۚ وَيَسْتَـْٔذِنُ فَرِيقٌ مِّنْهُمُ ٱلنَّبِىَّ يَقُولُونَ إِنَّ
بُيُوتَنَا عَوْرَةٌ وَمَا هِىَ بِعَوْرَةٍ ۖ إِن يُرِيدُونَ إِلَّا فِرَارًا ﴿١٣﴾

మాతో చేసిన వాగ్దానం మోసం తప్ప మరేమీ కాదు"[27] అని చెప్పసాగారు.

**13** అప్పుడు వారిలోని ఒక వర్గం ఈ విధంగా గగ్గోలు చెందింది : "ఓ యస్రిబ్ (మదీనా) వాసులారా![28] ఇక మీరిక్కడ ఉండటానికి అవకాశమే లేదు. తిరుగు ముఖం పట్టండి."[29] మరి వారిలోని ఒక బృందం, "మా ఇండ్లు సురక్షితంగా లేవు"[30] అని చెప్పి దైవప్రవక్త (స) నుంచి అనుమతి కోరసాగింది. మరి (చూడబోతే) అవి అభద్రంగా ఏమీలేవు. (అసలు) వారి ఉద్దేశం పలాయనం చిత్తగించాలన్నదే.[31]

26. అంటే ముస్లింలను భయాందోళనలకు, ఆకలిబాధకు, ప్రాణభీతికి లోనుచేసి వారిలో కల్తీ సరకు ఎంత ఉందో – మేలిమి సరకు ఎంత ఉందో పరికించటం జరిగింది. అమ్ముడుపోయే సరకును (కపటులను) వేరుపరచటం దీని ముఖ్యోద్దేశం.

27. అంటే, తమకు సహాయం చేస్తామని దేవుడు, దైవప్రవక్త మోసపూరితమైన వాగ్దానాలు చేశారంటూ ఈ సందర్భంగా 70 మంది కపటులు తమ నిజస్వరూపాన్ని బయటపెట్టు కున్నారు. అప్పటి వరకూ వారి మనసులలో ఉన్న అక్కసు కాస్తా కష్టకాలం రాగానే ఒక్కసారిగా బయటపడిపోయింది.

28. **'యస్రిబ్'** (يَثْرِب) అనేది ఆ ప్రాంతానికంతటికీ ఉన్న మొదటి పేరు. మదీనా నగరం ఆ ప్రాంతంలో ఒక భాగం మాత్రమే. ఒకానొకప్పుడు అమాలిఖా అనే చోట యస్రిబ్ బిన్ ఉమైల్ అనే వ్యక్తి విడిది చేశాడు. అతని పేరుమీదే ఆ క్షేత్రం 'యస్రిబ్' అని పిలువబడింది (ఫత్‌హుల్ ఖదీర్).

29. అంటే ముస్లింల తరఫున పోరాడటం చాలా కష్టం. కాబట్టి ఒక ఇంటికి పదండి అని పురికొల్పారు.

30. అంటే బనూ ఖురైజా వారు నగరంలోకి జొరబడే ప్రమాదం పొంచి ఉంది. అదేగనక జరిగితే తమ ఆడవాళ్ళ మానమర్యాదలు మంట గలుస్తాయి. తమ ఆస్తిపాస్తులు దోచుకోబడతాయి అన్నది వారి మాటల్లోని ఆంతర్యం.

31. నిజానికి వారి భయాలన్నీ ఉత్తుత్తివే. అసలు వారు పారిపోవటానికి ఈ వంకలు పెడుతున్నారు. **'ఔరతున్'** (عَوْرَة) అనే పదానికి శాబ్దిక వ్యావహారిక అర్థాల వివరణ కోసం నూర్ సూరా 58వ ఆయతుకు రాసిన వ్యాఖ్యానం చూడండి.

**14** ఒకవేళ (మదీనా) నగరం నలువైపుల నుంచీ (శత్రువులు) చొచ్చుకు వచ్చి, అరాచకం సృష్టించమని వారిని కోరితే దానికి వారు తప్పకుండా అలా చేస్తారు. చాలా కొద్దిగా తప్ప ఆలస్యం చేయరు.[32]

وَلَوْ دُخِلَتْ عَلَيْهِم مِّنْ أَقْطَارِهَا ثُمَّ سُئِلُوا الْفِتْنَةَ
لَآتَوْهَا وَمَا تَلَبَّثُوا بِهَا إِلَّا يَسِيرًا ﴿١٤﴾

**15** ఇదివరకు వారు, తాము వెన్ను చూపము అని అల్లాహ్‌కు మాటిచ్చి ఉన్నారు.[33] అల్లాహ్‌తో చేసిన బాస గురించి తప్పకుండా ప్రశ్నించటం జరుగుతుంది.[34]

وَلَقَدْ كَانُوا عَاهَدُوا اللَّهَ مِن قَبْلُ لَا يُوَلُّونَ الْأَدْبَارَ ۚ وَكَانَ
عَهْدُ اللَّهِ مَسْئُولًا ﴿١٥﴾

**16** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : “మీరు చావు నుండి లేదా వధ బారి నుండి భయపడి పారిపోతే ఈ పారిపోవటం మీకేమాత్రం ప్రయోజనం కలిగించదు. అట్టి పరిస్థితిలో మీరు కొద్దిపాటి ప్రయోజనాన్ని మాత్రమే పొందుతారు.[35]

قُل لَّن يَنفَعَكُمُ الْفِرَارُ إِن فَرَرْتُم مِّنَ الْمَوْتِ أَوِ الْقَتْلِ وَإِذًا
لَّا تُمَتَّعُونَ إِلَّا قَلِيلًا ﴿١٦﴾

32. అంటే మదీనా నగరం లోపలికి నలువైపుల నుంచీ శత్రువులు జొరబడి, ఇస్లాంను విడనాడి పాత మతం వైపుకు తిరిగి రమ్మని పురమాయిస్తే, వారు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెళ్ళిపోతారు. ఆ సమయంలో వారికి తమ ఇండ్లు సురక్షితంగా లేవన్న ఆలోచన కూడా ఉండదు. ముష్రిక్కుల ఉత్తర్వులకు తలవంచేస్తారు.

33. ఇంతకీ ఈ వర్గం వారెవరంటే బద్ర్ యుద్ధం జరిగే వరకూ వారు ఇస్లాం స్వీకరించలేదు. కాని ముస్లింలు బద్ర్ యుద్ధంలో గెలిచి, విజయధనాన్ని తీసుకుని వస్తున్నప్పుడు ఆదరాబాదరాగా వచ్చి ఇస్లాంలో చేరారు. భవిష్యత్తులో ఎప్పుడైనా ఇలాంటి యుద్ధ పరిస్థితి ఎదురైతే తాము అవిశ్వాసులతో శక్తివంచన లేకుండా పోరాడతామని శపథం కూడా చేశారు. ఆ మాటే ఈ సందర్భంగా జ్ఞాపకం చేయబడింది.

34. ఇచ్చిన మాటను ఎందుకు నిలుపుకోలేదని వారిని నిలదీసి అడగటం జరుగుతుంది. వారు చేసిన విశ్వాస ఘాతుకానికిగాను వారు శిక్షార్హులుగా నిలుస్తారు.

35. మృత్యువు నుంచి ఎవరూ తప్పించుకోలేరు. ఒకవేళ మీరు యుద్ధమైదానం నుంచి పారిపోయినా లాభమేముందీ? కొన్నాళ్ళ తరువాతైనా మృత్యువు రుచిని చవిచూడక తప్పదు.

**17** వారిని అడుగు : “ఒకవేళ అల్లాహ్ మీకు ఏదన్నా కీడు కలుగజేయాలనుకున్నా లేక మీపై దయజూపాలనుకున్నా ఆయన నుండి మిమ్మల్ని కాపాడగలవాడెవడు? (లేక అడ్డుకోగలవాడెవడు?)[36] వారు తమ కోసం అల్లాహ్ తప్ప ఏ సంరక్షకుణ్ణీ, ఏ సహాయకుణ్ణీ పొందలేరు.

قُلْ مَنْ ذَا الَّذِي يَعْصِمُكُمْ مِنَ اللَّهِ إِنْ أَرَادَ بِكُمْ سُوٓءًا أَوْ أَرَادَ بِكُمْ رَحْمَةً ۚ وَلَا يَجِدُونَ لَهُمْ مِنْ دُونِ اللَّهِ وَلِيًّا وَلَا نَصِيرًا ﴿١٧﴾

**18** మీలో ఇతరులను అడ్డుకునేవారెవరో, తమ సోదరుల నుద్దేశించి, “మా దగ్గరకు వచ్చేయండి”[37] అని చెప్పేవారెవరో అల్లాహ్‌కు (బాగా) తెలుసు. వారు ఎప్పుడో గాని యుద్ధానికి రారు.[38]

قَدْ يَعْلَمُ اللَّهُ الْمُعَوِّقِينَ مِنْكُمْ وَالْقَائِلِينَ لِإِخْوَانِهِمْ هَلُمَّ إِلَيْنَا ۖ وَلَا يَأْتُونَ الْبَأْسَ إِلَّا قَلِيلًا ﴿١٨﴾

**19** వారు మీకు తోడ్పడే విషయంలో (పరమ) పీనాసులు.[39] మరి భయాందోళనల పరిస్థితి ఎదురైనప్పుడు, చచ్చిపోయేవాడు కనుగుడ్లు తేలవేసినట్లు,[40] వారు నీ వైపు అదే పనిగా చూడటాన్ని నువ్వు గమనిస్తావు. ఆ తరువాత భయోత్పాతం

أَشِحَّةً عَلَيْكُمْ ۖ فَإِذَا جَآءَ الْخَوْفُ رَأَيْتَهُمْ يَنْظُرُونَ إِلَيْكَ تَدُورُ أَعْيُنُهُمْ كَالَّذِي يُغْشَىٰ عَلَيْهِ مِنَ الْمَوْتِ ۖ فَإِذَا ذَهَبَ

36. ఒకవేళ అల్లాహ్ మిమ్మల్ని అంతమొందించదలచినా, వ్యాధికి లోనుచేసినా, మీ సిరిసంపదలలో నష్టం కలుగజేసినా లేదా మిమ్మల్ని కరువు కాటకాలకు లోనుచేయదలచినా ఆయన పట్టునుంచి మిమ్మల్ని కాపాడగలవాడెవడు? ఒకవేళ ఆయన మీపై దయదలచాలనుకుంటే దయదలచకుండా అడ్డుకోగల మొనగాడెవడు?

37. ఈ విధంగా చెప్పినవారు కపటులు. తామెలాగూ యుద్ధంలో పాల్గొనరు. అయితే యుద్ధం కోసం వెళుతున్న నికార్సయిన ముస్లింలను కూడా అడ్డుకునేందుకు యత్నించేవారు.

38. ఎందుకంటే వారికి వారి ప్రాణాలు ఎంతో ముఖ్యం.

39. అంటే ముస్లింలతో కలసి కందకం త్రవ్వటంలో గానీ, దైవమార్గంలో ధనాన్ని వ్యయపరచటంలోగానీ, మీతో కలసి యుద్ధం చేయటంలోగానీ మనస్ఫూర్తిగా ముందుకు రాలేదు. ప్రతి పనీ అన్య మనస్కంగానే చేశారు.

40. అది వారి పిరికితనాన్నీ, ప్రాపంచిక వ్యామోహాన్నీ వ్యక్తపరుస్తోంది.

వీడిపోతున్నప్పుడు, తమ పదునైన నాలుక లతో కోతలు కోస్తూ, నీ దగ్గరకు వస్తారు.[41] విపరీతమైన ధనవ్యామోహం ఉన్నవారు.[42] వారసలు విశ్వసించనేలేదు.[43] అల్లాహ్ వారి కర్మలన్నింటినీ వృథా గావించాడు.[44] అలా చేయటం అల్లాహ్‌కు చాలా తేలిక.[45]

الْخَوْفُ سَلَقُوكُم بِأَلْسِنَةٍ حِدَادٍ أَشِحَّةً عَلَى الْخَيْرِ ۚ أُولَٰئِكَ لَمْ يُؤْمِنُوا فَأَحْبَطَ اللَّهُ أَعْمَالَهُمْ ۚ وَكَانَ ذَٰلِكَ عَلَى اللَّهِ يَسِيرًا ⑲

**20** సైన్యాలు ఇంతవరకూ తిరిగివెళ్ళలేదనే వారు భావిస్తున్నారు.[46] ఒకవేళ సైన్యాలు (మళ్లీ) వచ్చిపడినట్లయితే, తాము

يَحْسَبُونَ الْأَحْزَابَ لَمْ يَذْهَبُوا ۖ وَإِن يَأْتِ الْأَحْزَابُ يَوَدُّوا لَوْ أَنَّهُم بَادُونَ فِي الْأَعْرَابِ يَسْأَلُونَ عَنْ أَنبَائِكُمْ

41. అంటే–వారు తమ శౌర్యాన్ని, వీరోచిత పోరాటాన్ని గురించి అదేపనిగా కోతలు కోస్తారు. వాస్తవానికి అదంతా అబద్ధమే. 'విజయప్రాప్తి'ని పంపిణీ చేసే సమయంలో తమ పోరాట పటిమ గురించి గొప్పలు చెప్పుకుని అందరినీ ప్రభావితుల్ని చేసి ఎక్కువ సొమ్మును పుచ్చుకోవాలన్నది వారి ఉద్దేశమై ఉంటుంది. ఈ ఆయతుకు తాత్పర్యంగా హజ్రత్ ఖతాద (రజి) ఇలా అంటున్నారు: "వీరు విజయ ప్రాప్తి పంపకం సందర్భంగా పరమ లోభులుగా ఉంటారు. అందరికన్నా చెడ్డవాటాను పొందుతారు. యుద్ధసమయంలో వట్టి పిరికిపందలుగా వ్యవహరిస్తారు. తమను నమ్ముకున్న స్నేహితులను నిస్సహాయులుగా వదలి పారిపోతారు."

42. దీనికి మరొక అర్థం ఏమిటంటే, వారిలో మంచి అన్నది ఏ కోశానా ఉండదు. అంటే ఇన్ని దుర్గుణాలకు తోడు వారిలో ఒక సద్గుణం కూడా ఉండదు.

43. అంటే విశ్వాసం (ఈమాన్) అనే విత్తనం వారి మనోక్షేత్రంలో నాటుకోలేదు. ఎందుకంటే వారి మనసులు అవిశ్వాసం, వైరభావంతో నిండి ఉన్నాయి.

44. ఎందుకంటే వారు ఇప్పటివరకూ ముష్రిక్కులుగా, కాఫిర్లుగా ఉన్నారు. ముష్రిక్కుల, కాఫిర్ల ఆచరణలు మిథ్యగానే మిగిలిపోతాయి. వాటికి సత్ఫలితమేదీ లభించదు. లేదా ఇక్కడ **'అహ్‌బత'** (أَحْبَطَ) అన్న పదం **'అజ్‌హర'** (أَظْهَرَ) అన్న అర్థంలో వాడబడి ఉంటుంది. అంటే వారి నిష్ఫల కర్మల బండారాన్ని దేవుడు బయటపెట్టేశాడు. ఎందుకంటే వారి కర్మలు పుణ్యఫలానికి నోచుకోదగ్గవిగా లేనేలేవు. (ఫత్‌హుల్ ఖదీర్)

45. అంటే వారి ఆచరణలను నిరర్థకంగా చేయటం లేక వారి కాపట్య రోగాన్ని బహిర్గతం చేయటం అల్లాహ్‌కు ఏ మాత్రం కష్టంకాదు.

46. కపటుల పిరికితనానికి ఇది మరో మచ్చుతునక. అవిశ్వాసుల సైనిక దళాలు ఆశలు వదలుకుని ఏనాడో తిరుగుముఖం పట్టినప్పటికీ ఈ కపటుల భయాలు మాత్రం

ఎడారుల్లో పల్లెవాసులతోనే ఉండి, మీ సమాచారాలు తెలుసుకుంటూ ఉంటే బావుండేదే[47] అని కోరుకుంటారు. ఒకవేళ వారు మీ మధ్యలో వున్నా (ఒరిగేదేమీ లేదు. వారు) అంతంత మాత్రంగానే పోరాడతారు.[48]

وَلَوْ كَانُوا فِيكُم مَّا قَاتَلُوا إِلَّا قَلِيلًا ۝٢٠

21 నిశ్చయంగా దైవప్రవక్తలో మీ కొరకు అత్యుత్తమ ఆదర్శం ఉంది[49]– అల్లాహ్ పట్ల, అంతిమ దినం పట్ల ఆశ కలిగి ఉండి, అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించే ప్రతి ఒక్కరి కొరకు.[50]

لَقَدْ كَانَ لَكُمْ فِي رَسُولِ اللَّهِ أُسْوَةٌ حَسَنَةٌ لِّمَن كَانَ يَرْجُوا اللَّهَ وَالْيَوْمَ الْآخِرَ وَذَكَرَ اللَّهَ كَثِيرًا ۝٢١

ఇంకా తొలగిపోలేదు. ఇప్పటికీ శత్రుసైన్యాలు తమ స్థావరాల వద్ద మోహరించి ఉన్నాయని వారు కాకిలెక్కలు వేస్తున్నారు.

47. దీనిద్వారా కపటుల ద్రోహబుద్ధి తెలిసివస్తోంది. ఒకవేళ అవిశ్వాసుల సైనికదళాలు మళ్లీ మదీనా నగరంపైకి దండెత్తి వస్తే మాత్రం ఈ నయవంచకులు ప్రతిఘటనకు సిద్ధం అవరు. పైగా వీళ్లు ఏదన్నా పల్లెటూరుకు పోయి, అక్కడి ప్రజలతో కాలక్షేపం చేస్తూ యుద్ధసమాచారం తెలుసుకుంటూ ఉండాలని కోరుకుంటారు. ముహమ్మద్ (సఅసం) మరియు అతని సహచరులు అంతమొందించబడ్డారా? లేదా? అవిశ్వాసుల సైన్యం విజయపతాకం ఎగురవేసిందా? లేదా? అన్నది వారి మనోగతం అయి ఉంటుంది.

48. పరువు దక్కదేమోనన్న ఉద్దేశంతో వారు కదన రంగానికి వస్తారు. కాని మనస్ఫూర్తిగా పోరాడరు. ఈ ఆయతులో కపటుల వైఖరి తీవ్రంగా ఖండించబడింది.

49. ఓ ముస్లింలారా! ఓ కపటులారా!! మీరందరి కోసం దైవప్రవక్త (సఅసం) జీవితంలో గొప్ప ఉదాహరణ ఉంది. కనుక మీరు సహనస్థయిర్యాల విషయంలోనూ, పోరాట పటిమలోనూ మీ ప్రవక్తనే ఆదర్శంగా తీసుకోండి. మా ప్రవక్త సర్వవిధాలా మీకు ఆదర్శప్రాయుడు. ఎందుకంటే అతను ధర్మయుద్ధ సందర్భంగా ఆకలితో గడిపాడు. తన బాధను సహచరులకు తెలియనివ్వకుండా ఉండటానికి కడుపుకు రాళ్లు కట్టుకున్నాడు. యుద్ధంలో అతని ముఖారవిందం గాయపడింది. అతని పన్ను సయితం (ఒకటి) ఊడిపోయింది. అతను తన స్వహస్తాలతో కందకం త్రవ్వాడు. సుమారు నెల రోజుల పాటు శత్రువులకు ఎదురొడ్డి నిలబడ్డాడు.

ఈ ఆయతు అహ్జాబ్ యుద్ధం నేపథ్యంలో అవతరించినప్పటికీ, యుద్ధ సందర్భంగా

وَلَمَّا رَاَ الْمُؤْمِنُوْنَ الْاَحْزَابَ ۙ قَالُوْا هٰذَا مَا وَعَدَنَا اللّٰهُ وَرَسُوْلُهٗ وَصَدَقَ اللّٰهُ وَرَسُوْلُهٗ ۡ وَمَا زَادَهُمْ اِلَّآ اِيْمَانًا وَّتَسْلِيْمًا ﴿٢٢﴾

**22** విశ్వాసులు (అవిశ్వాసుల) సేనలను చూడగానే(అప్రయత్నంగా) ఇలా అన్నారు: "అల్లాహ్, ఆయన ప్రవక్త మనకు వాగ్దానం చేసిన విషయం ఇదే. అల్లాహ్, ఆయన ప్రవక్త చెప్పింది నిజమే."[51] ఆ సంఘటన వారి విశ్వాసాన్ని, ఆత్మ సమర్పణాభావాన్ని మరింత అధికం చేసింది.[52]

దైవప్రవక్త (స)ను ఆదర్శంగా తీసుకోవాలని ఇందులో ప్రత్యేకంగా చెప్పబడినప్పటికీ, ఇందలి ఆజ్ఞ సర్వసాధారణం. అంటే ఆయన ప్రవచనాలు, ఆచరణలు, వ్యవహారాలన్నీ ముస్లింల కొరకు ఆదర్శప్రాయం. అవి ఆరాధనలకు సంబంధించినవైనా, సామాజిక నియమాలకు సంబంధించినవైనా, ఆర్థికమైనవైనా, రాజకీయ సంబంధమైనవైనా వాటిని ముస్లింలు అనుసరించటం అవశ్యం. జీవితపు అన్ని రంగాలలోనూ ప్రవక్త(స) వారి సూచనలు అనుసరణీయమైనవి. "దైవప్రవక్త మీకు ఇచ్చిన దాన్ని పుచ్చుకోండి. ఆయన నిషేధించిన వాటి జోలికి పోకండి" (అల్ హష్ర్ – 7) అన్న దివ్య వచనం సారాంశం ఇదే. "మీకు నిజంగానే అల్లాహ్‌పట్ల ప్రేమ ఉంటే, మీరు నన్ను అనుసరించండి. అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు" (ఆలి ఇమ్రాన్ – 31) అన్న ఆయతులోని నిగూఢార్థం కూడా ఇదే.

50. ఈ వాక్యం ద్వారా స్పష్టంగా అవగతమయ్యేదేమిటంటే పరలోకంలో అల్లాహ్‌ను కలుసుకునే విషయమై దృఢనమ్మకం ఉన్నవాడు, అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించేవాడు మాత్రమే దైవప్రవక్త (స) జీవితాన్ని ఆదర్శంగా తీసుకుంటాడు. కాని దురదృష్టవశాత్తు నేటి ముస్లింలలో ఈ రెండు సుగుణాలు సన్నగిల్లుతున్నాయి. అందువల్ల దైవప్రవక్త (స) జీవితాన్ని ఆదర్శప్రాయంగా తీసుకోవటానికి వారు తగినంత ప్రాధాన్యత ఇవ్వటం లేదు. వారి మతనాయకులు, విద్వాంసులు, ఆధ్యాత్మిక గురువులు, రాజకీయవేత్తలు – అందరూ దైవప్రవక్త (సఅసం) పట్ల గల గౌరవ ప్రపత్తులను గురించి అనర్గళంగా ఉపన్యసిస్తారు. కాని క్రియాత్మకంగా ఆయన్ని (స) మార్గదర్శకునిగా ఒప్పుకుని, ఆయన అడుగుజాడలలో నడవటానికి ఏ ఒక్కరూ ముందుకు రారు. ఇది కడు శోచనీయం.

51. పరిస్థితుల సంక్లిష్ట స్వరూపాన్ని, శత్రు సైనికుల భారీ సమూహాన్ని చూడగానే కపటుల గుట్టు రట్టయింది. దేవుడు, దైవప్రవక్త (స) తమకు ఇంతకాలంగా చేస్తూ వచ్చిన వాగ్దానం ఉత్తుత్తిదే అని వారు చెప్పనే చెప్పేశారు. కాని అదే సమయంలో విశ్వాసుల ఆలోచనా తీరు ఎలా ఉందో చూడండి! కఠినంగా పరీక్షించబడిన తరువాత మీకు విజయం వరిస్తుంది అని దేవుడు, దైవప్రవక్త(స) చేసిన వాగ్దానం ముమ్మాటికీ నిజమే అని వారు అన్నారు.

مِنَ الْمُؤْمِنِينَ رِجَالٌ صَدَقُوا مَا عَاهَدُوا اللَّهَ عَلَيْهِ ۖ فَمِنْهُم
مَّن قَضَىٰ نَحْبَهُ وَمِنْهُم مَّن يَنتَظِرُ ۖ وَمَا بَدَّلُوا تَبْدِيلًا ﴿٢٣﴾

**23** విశ్వాసులలో కొందరు అల్లాహ్‌తో చేసిన వాగ్దానాన్ని నిజం చేసి చూపిన వారున్నారు.[53] కొందరు తమ వాగ్దానాన్ని నెరవేర్చుకోగా,[54] మరి కొందరు (అవకాశం కోసం) ఎదురు చూస్తున్నారు. వారు (తమ పోరాట స్ఫూర్తిలో) ఎలాంటి మార్పు రానివ్వలేదు.[55]

لِّيَجْزِيَ اللَّهُ الصَّادِقِينَ بِصِدْقِهِمْ وَيُعَذِّبَ الْمُنَافِقِينَ
إِن شَاءَ أَوْ يَتُوبَ عَلَيْهِمْ ۚ إِنَّ اللَّهَ كَانَ غَفُورًا رَّحِيمًا ﴿٢٤﴾

**24** (ఎందుకంటే) అల్లాహ్ సత్యవంతులకు వారి సత్యత యొక్క ప్రతిఫలం వొసగటానికి, ఇంకా (అల్లాహ్) తాను కోరితే కపటులను శిక్షించటానికి లేదా వారి పశ్చాత్తాపాన్ని స్వీకరించటానికి[56] (ఇదంతా జరిగింది). అల్లాహ్ అపారంగా క్షమించేవాడు, అమితంగా కరుణించేవాడు.

52. అంటే – పరిస్థితుల భయంకర స్వరూపానికి వారు బెదిరిపోలేదు. వారి అడుగులు తడబడలేదు. వారి విశ్వాసం క్షీణించలేదు. పైగా వారి విధేయతా భావం, అంకితభావం ద్విగుణీకృతం అయ్యింది. పరిస్థితుల స్వరూపం దృష్ట్యా ప్రజల విశ్వాసం (ఈమాన్) తరుగుతూ – పెరుగుతూ ఉంటుందనటానికి ఇదొక తార్కాణం. హదీసువేత్తల దృక్పథం కూడా ఇదే.

53. ఈ సందర్భంగా అసాధారణమైన త్యాగనిరతిని ప్రదర్శించిన కొంతమంది ప్రవక్త ప్రియసహచరుల గురించి ఈ ఆయతు అవతరించింది. బద్ర్ యుద్ధంలో పాల్గొనలేక పోయిన కారణంగా, భవిష్యత్తులో జరిగే యుద్ధంలో వీరోచితంగా పోరాడతామని ప్రతినబూనిన సహాబీల గురించి కూడా ఇందులో చెప్పటం జరిగింది. ఉదాహరణకు: నజర్ బిన్ అనస్ (రజి) తదితరులు. కాని వారు ఉహుద్ యుద్ధ సందర్భంగా వీర మరణం పొందారు. ఆయన శరీరంపై 80కి పైగా గాయాలు కనిపించాయి. అమరగతి నొందిన తరువాత ఆయన తోబుట్టువు ఆయన్ని వ్రేలి కణుపు ఆధారంగా గుర్తు పట్టగలిగింది. (ముస్నదె అహ్మద్–సంపుటి: 4, పేజీ–193).

54. అంటే, ఆ సత్యవంతులలో కొందరు తమ మొక్కుబడిని తీర్చుకుంటూ అమరగతి నొందారు. **'నహ్బున్'** ( نَحْبٌ ) అన్న పదానికి వాగ్దానం, మొక్కుబడి, మృత్యువు అనే అర్థాలు చెప్పబడ్డాయి.

55. వారిలో మరికొందరున్నారు. వారు కోరుకున్నట్లు ఇప్పటి వరకూ వారికి వీరమరణం

**25** అల్లాహ్ అవిశ్వాసులను వారి కోపం (రగులుతున్న) స్థితిలోనే వెనక్కి తరిమాడు. (అక్కడ) వారు ఏ లాభాన్నీ పొందలేదు.[57] విశ్వాసుల పక్షాన యుద్ధం చేయటానికి అల్లాహ్‌యే సరిపోయాడు.[58] అల్లాహ్ మహాబలుడు, ప్రాబల్యం కలవాడు.

وَرَدَّ اللّٰهُ الَّذِيْنَ كَفَرُوْا بِغَيْظِهِمْ لَمْ يَنَالُوْا خَيْرًا ۭ وَكَفَى اللّٰهُ الْمُؤْمِنِيْنَ الْقِتَالَ ۭ وَكَانَ اللّٰهُ قَوِيًّا عَزِيْزًا ۝٢٥

**26** వారికి (అంటే అవిశ్వాసులకు) తోడ్పడిన గ్రంథవహులను కూడా అల్లాహ్ వారి కోటల నుంచి దించేశాడు. (మీపట్ల) వారి గుండెలలో గుబులును నింపేశాడు. (దాంతో) మీరు వారిలోని ఒక వర్గాన్ని వధించసాగారు, మరో వర్గాన్ని బందీలుగా పట్టుకోసాగారు.

وَاَنْزَلَ الَّذِيْنَ ظَاهَرُوْهُمْ مِّنْ اَهْلِ الْكِتٰبِ مِنْ صَيَاصِيْهِمْ وَقَذَفَ فِيْ قُلُوْبِهِمُ الرُّعْبَ فَرِيْقًا تَقْتُلُوْنَ وَتَاْسِرُوْنَ فَرِيْقًا ۝٢٦

పొందే భాగ్యం లభించలేదు. కాని వీరమరణం పొందాలన్న వారి ఆరాటం కొనియాడదగినది. వారు తమ వాగ్దానానికి ఖచ్చితంగా కట్టుబడి ఉన్నారు. వారి వైఖరిలో లేశమైనా మార్పు రాలేదు.

56. అంటే ఇస్లాం వైపుకు చిత్తశుద్ధితో మరలే అవకాశం దేవుడు వారికి ఇవ్వటానికి.

57. ముస్లింలను నామరూపాల్లేకుండా చేయాలని అరబ్బు నలుమూలల నుంచి కట్టకట్టుకు వచ్చిన ముష్రిక్కు మూకలకు కలిగిన లాభం ఏమీలేదు. పైపెచ్చు వారు ఘోర పరాభవంతో ఇంటిదారి పట్టాల్సి వచ్చింది. అలా తిరిగి వెళుతున్నప్పుడు వారు ఆవేశంతో ఊగిపోయారు. అసూయతో లోలోపలే ఉడికిపోయారు. అంత ఆర్భాటంతో వచ్చినందుకు ప్రాపంచిక ప్రయోజనం కూడా ఏమీ కలగలేదు. పోనీ పరలోకంలో ఏదన్నా లభిస్తుందా అంటే అదీ లేదు. సర్వవిధాలా వారు నష్టపోయారు. వారి తలబిరుసుతనం వారినే బెడిసికొట్టింది.

58. అసలు ముస్లింలకు శత్రు సైన్యాలను మార్కొనవలసిన అగత్యమే ఏర్పడలేదు. ఆ వ్యవహారాన్ని అల్లాహ్‌యే చూసుకున్నాడు. ఆయన తన దూతల ద్వారా – అనూహ్యమైన రీతిలో – ముస్లింలను ఆదుకున్నాడు. అందుకే మహనీయ ముహమ్మద్ (సఅసం) వారు ఇలా ప్రవచించారు : **“లా ఇలాహ ఇల్లల్లాహు వహ్‌దహూ, సదఖ వాదహూ, వ నసర అబ్దహూ, వ అఅజ్జ జున్దహూ, వ హజమల్ అహ్‌జాబ వహ్‌దహూ. ఫలా షయ్‌అ బాదహూ.”** (సహీహ్ బుఖారీ – కితాబుల్ ఉమ్ర ; ముస్లిం – బాబు మా యఖూలు....) (అర్థం : ఒక్కడైన అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యుడు ఎవడూ లేడు. ఆయన తన

**27** ఇంకా ఆయన వారి భూములకు, వారి ఇండ్లకు, వారి సిరిసంపదలకు మిమ్మల్ని వారసులుగా చేశాడు.[59] మీరు కాలు మోపని భూమిని కూడా[60] (ఆయన మీ పాదాక్రాంతం చేశాడు). అల్లాహ్ అన్నింటిపై అధికారం కలవాడు సుమా!

وَاَوْرَثَكُمْ اَرْضَهُمْ وَدِيَارَهُمْ وَاَمْوَالَهُمْ وَاَرْضًا لَّمْ تَطَـُٔوْهَا ۚ وَكَانَ اللّٰهُ عَلٰى كُلِّ شَيْءٍ قَدِيْرًا ﴿٢٧﴾

వాగ్దానాన్ని నిజం చేసి చూపాడు. ఆయన తన దాసునికి తోడ్పడ్డాడు. తన సైన్యాన్ని గెలిపించాడు.(శత్రు) వర్గాలన్నింటినీ ఆయన ఒక్కడే ఓడించాడు. ఆయన తరువాత మరే వస్తువూ లేదు). ఈ దుఆను, హజ్, ఉమ్రా, జిహాద్ సమయాలలోనూ, ప్రయాణం నుంచి తిరిగి వచ్చిన సమయంలోనూ చేయవచ్చు.

59. ఈ ఆయతులో బనూ ఖురైజాతో జరిగిన యుద్ధ ప్రస్తావన ఉంది. బనూ ఖురైజా వారు మహాప్రవక్త (స)తో చేసుకున్న స్నేహ ఒప్పందాన్ని ఉల్లంఘించి – అహ్జాబ్ యుద్ధసందర్భంగా– అవిశ్వాసులకు, ఇతర యూదులకు సహాయం అందించారని ఇంతకు ముందు కూడా చెప్పటం జరిగింది.

అహ్జాబ్ యుద్ధం నుంచి ఇంటికి తిరిగి వచ్చిన తరువాత మహాప్రవక్త (స) స్నానాదులు ముగించుకుంటుండగానే దైవదూత హజ్రత్ జిబ్రయీల్ (అలైహిస్సలాం) ఏతెంచారు. "ఏమిటి? తమరు అప్పుడే ఆయుధాలు విడిచేశారా? మేము (దైవదూతలం) ఇంకా ఆయుధాలను చేబూని ఉన్నాం. పదండి. బనూ ఖురైజా సంగతి తేల్చవలసి ఉంది. ఈ పని కోసమే అల్లాహ్ నన్ను మీ దగ్గరకు పంపించాడు" అని చెప్పారు. దాంతో మహాప్రవక్త (స) యుద్ధప్రకటన చేయించారు. అంతేకాదు, అస్ర్ నమాజు అక్కడికెళ్ళి చేయాలని కూడా గట్టిగా తాకీదు చేశారు. ఖురైజా తెగవారు మదీనా నగరానికి కొన్ని మైళ్ల దూరంలో నివసించేవారు. ముస్లింల రాకను పసిగట్టిన ఆ తెగవారు తమ కోటల్లోకి వెళ్ళి, ద్వారాలన్నీ మూసేసారు. ముస్లింలు వారి కోటలను నలువైపుల నుంచీ ముట్టడించారు. ఈ ముట్టడి సుమారు 25 రోజుల దాకా సాగింది. ఎట్టకేలకు బనూ ఖురైజా వారు సాద్ బిన్ ముఆజ్ (రజి)ను తమ తీర్పరి (మధ్యవర్తి)గా అంగీకరించారు. ఆయన చేసిన తీర్పును శిరసావహిస్తామని కూడా మాటిచ్చారు. బనూ ఖురైజాలో యుద్ధం చేయగల శక్తి ఉన్న వారందరినీ వధించాలనీ, చిన్న పిల్లలను, స్త్రీలను ఖైదీలుగా పట్టుకోవాలని, వారి ఆస్తిపాస్తులను ముస్లింలకు పంచిపెట్టాలని సాద్ తీర్పు ఇచ్చారు. ఈ తీర్పును వినగానే, "ఆకాశాలలో అల్లాహ్ చేసిన తీర్పు కూడా ఇదే" అని దైవప్రవక్త (స) చెప్పారు. తీర్పు ననుసరించి పోరాడే వారందరికీ శిరచ్ఛేదన శిక్ష విధించబడింది. ఆ విధంగా మదీనా నగరానికి విద్రోహుల బెడద తప్పింది. (వివరాల కోసం సహీహ్ బుఖారీ – కందక పోరాట అధ్యాయం చూడండి).

**28** ఓ ప్రవక్తా! నీ భార్యలకు ఇలా చెప్పు: "మీరు గనక ప్రాపంచిక జీవితాన్ని, దాని తళుకు బెళుకులను కోరుకుంటూ ఉన్నట్లయితే, రండి, నేను మీకు ఎంతో కొంత ఇచ్చి, మిమ్మల్ని ఉత్తమరీతిలో సాగనంపుతాను –

يَٰٓأَيُّهَا ٱلنَّبِيُّ قُل لِّأَزْوَٰجِكَ إِن كُنتُنَّ تُرِدْنَ ٱلْحَيَوٰةَ ٱلدُّنْيَا
وَزِينَتَهَا فَتَعَالَيْنَ أُمَتِّعْكُنَّ وَأُسَرِّحْكُنَّ سَرَاحًا جَمِيلًا ﴿٢٨﴾

**29** "కాని ఒకవేళ అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను, పరలోక నిలయాన్ని పొందాలన్నదే మీ లక్ష్యమైతే, మీలోని సద్వర్తనుల కోసం అల్లాహ్ గొప్ప పుణ్యఫలాన్ని సిద్ధం చేసి ఉంచాడు."[61]

وَإِن كُنتُنَّ تُرِدْنَ ٱللَّهَ وَرَسُولَهُۥ وَٱلدَّارَ ٱلْءَاخِرَةَ فَإِنَّ
ٱللَّهَ أَعَدَّ لِلْمُحْسِنَٰتِ مِنكُنَّ أَجْرًا عَظِيمًا ﴿٢٩﴾

---

**'అన్‌జల'** (أَنزَلَ) అంటే కోటల నుంచి క్రిందికి దింపాడనీ, **'జాహరూహుమ్'** (ظَاهَرُوهُم) అంటే వారు అవిశ్వాసులకు సహాయపడ్డారని అర్థం.

60. ఇంతకీ ముస్లింలు కాలుమోపని ఆ 'భూమి' ఏది? అది ఖైబర్ భూమి అని కొందరు అభిప్రాయపడ్డారు. ఎందుకంటే ఈ ముట్టడి తరువాతనే ముస్లింలు హిజ్రీ 6వ ఏట – హుదైబియా సంధి అనంతరం – ఖైబర్‌ను జయించారు. మరి కొంతమంది 'అది మక్కా నేల' అని భావించారు. ఇంకా కొంతమంది దాన్ని రోము, పారసీక భూభాగాలుగా పేర్కొన్నారు. కొంతమంది విద్వాంసుల దృష్టిలో, ప్రళయదినం వరకు ముస్లింలు జయించే భూభాగాలన్నీ ఆ 'భూమి' క్రిందికి వస్తాయి (ఫత్‌హుల్ ఖదీర్).

61. విజయాల తరువాత ముస్లింల ఆర్థిక పరిస్థితులు కొంత మెరుగుపడ్డాయి. అన్సార్ల, ముహాజిర్ల మహిళల జీవన ప్రమాణాలను చూసిన తరువాత దైవప్రవక్త (స) సతీమణులలో కూడా సహజంగానే కోరికలు జనించాయి. తమకు ఇవ్వబడుతున్న జీవన భృతిని పెంచవలసిందిగా వారంతా కలసి ప్రవక్తను డిమాండు చేశారు. కాని నిరాడంబర జీవి అయిన దైవప్రవక్త (స)కు తన భార్యల ధోరణి నచ్చలేదు. ఆయనకు మనస్తాపం కలిగింది. ఆయన తన భార్యల నుంచి నెల రోజులదాకా వేరైపోయారు. చివరకు అల్లాహ్ ఈ ఆయతును అవతరింపజేశాడు. అప్పుడు దైవప్రవక్త (సఅసం) అందరికన్నా ముందు హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా)కు ఈ ఆయతును వినిపించి 'స్వయం నిర్ణయాధికారం' ఇచ్చారు. అయితే నిర్ణయం గైకొనే ముందు ఒకసారి తల్లిదండ్రులను కూడా సంప్రతించమని సూచించారు. దానికి హజ్రత్ ఆయిషా (ర.అ) "ఏమిటీ, మీ విషయంలో నేను నా తల్లిదండ్రులను సంప్రతించాలా?! ఇదెలా

30 ఓ ప్రవక్త సతీమణులారా! మీలో ఎవరయినాసరే స్పష్టంగా అసభ్యకరమైన చేష్టకి పాల్పడినట్లయితే ఆమెకు రెండింతల శిక్ష విధించబడుతుంది.[62] ఇది అల్లాహ్‌కు చాలా తేలిక.

يٰنِسَآءَ النَّبِيِّ مَنْ يَّاْتِ مِنْكُنَّ بِفَاحِشَةٍ مُّبَيِّنَةٍ يُّضٰعَفْ لَهَا الْعَذَابُ ضِعْفَيْنِ ۭ وَكَانَ ذٰلِكَ عَلَى اللّٰهِ يَسِيْرًا ۝۳۰

సాధ్యం? నాకు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తే కావాలి" అన్నారు. సతీమణులంతా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. వారిలో ఏ ఒక్కరు కూడా దైవప్రవక్త (స)ను వదలి ప్రాపంచిక వైభవాల వైపుకు మొగ్గుచూపలేదు. (సహీహ్ బుఖారీ – అహ్జాబ్ సూరా వ్యాఖ్యానం).

ఈ సంఘటన జరిగేనాటికి దైవప్రవక్త (స) దాంపత్యంలో తొమ్మండుగురు భార్యలున్నారు. వారిలో ఐదుగురు ఖురైషు మహిళలు (ఆయిషా, హఫ్స, ఉమ్మె హబీబా, సౌదా, ఉమ్మె సల్మా). నలుగురు ఖురైషేతర మహిళలు (సఫియా, మైమూన, జైనబ్, జువేరియా). పురుషుని తరఫున గైకొనబడే నిర్ణయాధికారాన్ని కొంతమంది 'తలాఖ్'గా పరిగణిస్తారు. ఇది సరైనది కాదు. స్వయం నిర్ణయాధికారం (వేర్పడే అధికారం) ఇవ్వబడిన పిదప, స్త్రీ వేర్పడాలని నిర్ణయించుకుంటేనే విడాకుల ప్రసక్తి వస్తుంది. (అది కూడా 'తలాఖె రజయీ'గా పరిగణించబడుతుందే తప్ప, కొంతమంది భావిస్తున్నట్లు అది 'తలాఖె బాయిన్' క్రిందికి రాదు). స్త్రీ గనక వేర్పాటుకు సుముఖంగా లేనిపక్షంలో విడాకుల ప్రసక్తిరాదు. ఉదాహరణకు : హజ్రత్ ఆయిషా (ర.అన్హా) నే చూడండి. ఆమెగారు విడియాకులు పుచ్చుకునేబదులు దైవప్రవక్త (స) సహధర్మచారిణిగా ఉండటానికే ఇష్టపడ్డారు. అప్పుడు ఈ 'నిర్ణయాధికారం' తలాఖ్‌గా పరిగణించబడలేదు. (సహీహ్ బుఖారీ – కితాబుత్తలాఖ్; ముస్లిం).

62. దివ్య ఖుర్ఆన్‌లో **'అల్ ఫాహిషతు'** (الفاحشة) అనే పదం 'వ్యభిచారం' అన్న భావంలో ప్రయోగించబడింది. కాని ఇక్కడ మాత్రం **'ఫాహిషతిన్'** (فاحشة) అని సాధారణ నామం ఉంది. అవాంఛనీయమైన, అమర్యాదకరమైన, దురుసైన అన్న భావంలో ఈ పదం ఉపయోగించబడింది. దైవప్రవక్త (స) యెడల దురుసుగా ప్రవర్తించటం, ఆయన మనసును నొప్పించటం కూడా చాలా తీవ్రమైన విషయమే. ఇది 'కుఫ్ర్' (అవిశ్వాసం) క్రిందికి వస్తుంది. అదీగాక దైవప్రవక్త (స) సతీమణులంటే ఉన్నత శ్రేణికి చెందినవారు. ఉన్నత శ్రేణికి చెందినవారు చేసే చిన్న చిన్న పొరపాట్లు కూడా పెద్ద పొరబాట్లుగానే ఎంచబడతాయి. అందువల్ల ప్రవక్త భార్యల వల్ల జరిగే మామూలు తప్పుకు కూడా రెట్టింపు శిక్ష విధించబడుతుందని హెచ్చరించబడింది.

**31** మరి మీలో ఎవరు అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు విధేయత కనబరుస్తారో, సదా చరణ చేస్తారో ఆమెకు మేము రెండింతల పుణ్యఫలాన్ని ప్రసాదిస్తాము.[63] ఆమె కోసం మేము గౌరవప్రదమైన ఉపాధిని సిద్ధం చేసి ఉంచాము.

وَمَنْ يَّقْنُتْ مِنْكُنَّ لِلّٰهِ وَرَسُوْلِهٖ وَتَعْمَلْ صَالِحًا نُّؤْتِهَآ اَجْرَهَا مَرَّتَيْنِ ۙ وَاَعْتَدْنَا لَهَا رِزْقًا كَرِيْمًا ﴿٣١﴾

**32** ఓ ప్రవక్త సతీమణులారా! మీరు సాధారణ స్త్రీల వంటివారు కారు.[64] మీరు (అల్లాహ్‌కు) భయపడేవారే అయితే సుతిమెత్తని శైలిలో మాట్లాడకండి. దాని వల్ల హృదయంలో (దురాలోచనా) రోగం ఉన్నవాడు అత్యాశకు పోవచ్చు.[65] కనుక

يٰنِسَآءَ النَّبِيِّ لَسْتُنَّ كَاَحَدٍ مِّنَ النِّسَآءِ اِنِ اتَّقَيْتُنَّ فَلَا تَخْضَعْنَ بِالْقَوْلِ فَيَطْمَعَ الَّذِيْ فِيْ قَلْبِهٖ مَرَضٌ

63. వారు చేసిన తప్పుకు రెట్టింపు శిక్ష విధించినట్లే, వారు చేసిన సత్కార్యాలకు పుణ్యఫలం కూడా రెట్టింపుగా ఇవ్వబడుతుందని చెప్పబడింది. దివ్య ఖుర్ఆన్‌లో వేరొకచోట దేవుడు తన ప్రవక్త (స)ను సయితం ఈ మేరకు హెచ్చరించాడు: "(ఓ ప్రవక్తా!) ఒకవేళ నువ్వు (వారివైపుకు) మొగ్గివుంటే మేము నీకు ప్రపంచంలో కూడా రెండింతల శిక్ష విధించేవారం. పరలోకంలో కూడా రెట్టింపు శిక్ష ఉంటుంది"

*(బనీ ఇస్రాయీల్ - 75).*

64. అంటే, మీ స్థాయి, స్థానం వేరితర స్త్రీల స్థాయివంటిది కాదు. దేవుడు మీకు దైవప్రవక్త (సఅసం) భార్యలుగా ఉండే సౌభాగ్యాన్ని ప్రసాదించాడు. ఆ కారణంగా ముస్లిం సమాజంలో మీకొక విశిష్టస్థానం లభించింది. కాబట్టి దైవప్రవక్త (సఅసం) మాదిరిగా మీరు కూడా ముస్లిం సమాజానికి ఓ ఉదాహరణగా ఉండాలి అన్నది దీని భావం.

ఆ విధంగా వారికి వారి స్థానాన్ని గుర్తుచేసి, కొన్ని మార్గదర్శక నియమాలు సూచించ బడ్డాయి. ప్రత్యక్షంగా ప్రవక్త సతీమణులనుద్దేశించి ఈ ఉపదేశం చేయబడినప్పటికీ, బోధనాతీరును బట్టి అది సమస్త ముస్లిం మహిళావనికి వర్తిస్తుంది. కాబట్టి ముస్లిం మహిళలంతా ఈ ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటించాల్సిందే.

65. ఏ విధంగానయితే దేవుడు స్త్రీ అస్థిత్వంలో పురుషుని కోసం లైంగిక ఆకర్షణను ఉంచాడో, అదేవిధంగా స్త్రీ కంఠస్వరంలో కూడా ఒకలాంటి లావణ్యాన్ని, లాలిత్యాన్ని, సౌకుమార్యాన్ని ప్రకృతిపరంగా పొందుపరచాడు. అది మగాణ్ణి ఇట్టే ఆకట్టుకుంటుంది. అందుకే పర పురుషులతో మాట్లాడవలసి వచ్చినప్పుడు ఉద్దేశ్యపూర్వకంగా ఎలాంటి మెతకదనాన్ని, వయ్యారాన్ని ఒలకపోయకుండా జాగ్రత్తపడాలనీ, సూటిగా, నిర్ద్వంద్వంగా మాట్లాడాలని ఉపదేశించబడింది.

وَقُلْنَ قَوْلًا مَّعْرُوفًا ۝٣٢

మాట్లాడితే ఉత్తమ రీతిలోనే మాట్లాడండి.[66]

وَقَرْنَ فِي بُيُوتِكُنَّ وَلَا تَبَرَّجْنَ تَبَرُّجَ الْجَاهِلِيَّةِ الْأُولَىٰ
وَأَقِمْنَ الصَّلَاةَ وَآتِينَ الزَّكَاةَ وَأَطِعْنَ اللَّهَ وَرَسُولَهُ
إِنَّمَا يُرِيدُ اللَّهُ لِيُذْهِبَ عَنكُمُ الرِّجْسَ أَهْلَ الْبَيْتِ
وَيُطَهِّرَكُمْ تَطْهِيرًا ۝٣٣

**33** మీరు మీ ఇండ్లల్లోనే ఆగి ఉండండి.[67] పూర్వపు అజ్ఞానకాలంలో మాదిరిగా మీ సింగారాన్ని చూపిస్తూ తిరగకండి.[68] నమాజు చేస్తూ ఉండండి. జకాతు ఇస్తూ ఉండండి. అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు విధేయత చూపుతూ ఉండండి.[69] ఓ ప్రవక్త ఇంటివారలారా![70] మీ నుండి (అన్ని రకాల) మాలిన్యాన్ని దూరం చేయాలన్నది, మిమ్మల్ని పూర్తిగా పరిశుద్ధపరచాలన్నది అల్లాహ్ అభిలాష.

66. కేవలం సూటిగా మాట్లాడితేనే సరిపోదు. మాట సరైన రీతిలో మాట్లాడాలి. మాట నైతిక పరిధిని దాటకూడదు. మాటల్లో ద్వంద్వార్థాలకు తావుండకూడదు. దైవానికి భయపడి, పరలోక చింతన కలిగి ఉండే సౌశీల్యవతులు దీని ప్రాముఖ్యాన్ని ఇట్టే గ్రహిస్తారు. ఈ నిర్దేశిక నియమాలను ఖచ్చితంగా పాటిస్తారు. కాని ఏ స్త్రీల ఆంతర్యాలలో దైవభక్తి, పరలోక భీతిలేదో వారు ఈ మార్గదర్శక సూత్రాలను ఖాతరుచెయ్యరు.

67. అంటే అవసరం లేకుండానే ఇల్లు వదలి బయటకు రాకండి. గృహపరిధిలోనే స్త్రీకి రక్షణ ఉందనీ, రాజకీయ వ్యవహారాల్లో, ఆర్థిక విషయాల్లో స్త్రీలు అనవసరంగా తలదూర్చరాదని ఈ ఆయతు ద్వారా సంకేతం లభిస్తోంది.

68. ఒకవేళ ఏదేని కారణంపై ఇల్లు వదలి బయటకు రావలసివస్తే ఏవిధంగా మసలుకోవాలో ఇక్కడ తెలియజేయబడింది. అట్టి పరిస్థితిలో సింగారించుకుని వెళ్ళరాదు. తమ అలంకరణ అందరికీ కనిపించేలా తిరగకూడదు. పైగా వారు పరదాను పాటించాలి. షరీయతు సూచించిన శరీరభాగాలను కప్పి ఉంచాలి. బయట తిరుగుతున్నప్పుడు సువాసన పూసుకోరాదు. సాదా సీదా దుస్తులు ధరించి, బురఖాలో నిరాడంబరంగా తిరగాలి. అలంకరణను, సింగారాన్ని ప్రదర్శించుకుంటూ తిరగటం అజ్ఞాన కాలం నాటి పోకడ అని ఖుర్‌ఆన్ స్పష్టపరచింది. ఇస్లాంకు పూర్వం ఈ విధమైన ప్రదర్శన జరిగేది. ఇస్లాం దీనిని నిషేధించింది. కాబట్టి ఇకమీదట ఎవరు, ఎప్పుడు ఈ అజ్ఞాన పోకడకు పాల్పడినా దానికి ఇస్లాంతో ఎలాంటి సంబంధం లేదని తెలుసుకోవాలి.

69. ఇంతకుముందు వచ్చిన ఆదేశాలలో చెడులను విడనాడమని చెప్పబడింది. ఈ ఆదేశాలలో మంచిని చేయమని చెప్పబడింది.

70. **'ప్రవక్త ఇంటివారలు'** అంటే ఎవరెవరు? దీని నిర్ధారణ విషయంలో కాస్త భేదాభిప్రాయం

**34** మీ ఇండ్లలో పారాయణం చేయబడే అల్లాహ్ ఆయతులను, ప్రవక్త ప్రవచనాలను స్మరించుకుంటూ ఉండండి.[71] నిశ్చయంగా అల్లాహ్ మృదుస్వభావి, అన్నీ తెలిసినవాడు.

وَاذْكُرْنَ مَا يُتْلَىٰ فِي بُيُوتِكُنَّ مِنْ آيَاتِ اللَّهِ وَالْحِكْمَةِ ۚ إِنَّ اللَّهَ كَانَ لَطِيفًا خَبِيرًا ﴿٣٤﴾

ఉంది. ఖుర్‌ఆన్ నేపథ్యంలో కొందరు 'ప్రవక్త సతీమణులు' అని భావించారు. ఈ ఆయతు ద్వారా ఇదే అర్థం వస్తుంది. దివ్య ఖుర్‌ఆన్‌లో వేరితర చోట్ల కూడా సతీమణిని ఇంటివారుగా పేర్కొనటం జరిగింది. ఉదాహరణకు హూద్ సూరాలోని 73వ ఆయతు. కాబట్టి "ఇంటివారలు" అన్న పదంలో "ప్రవక్త సతీమణులు" ఇమిడి ఉన్నారన్న దానికి ఖుర్‌ఆన్ వచనమే ప్రబల నిదర్శనం.

అయితే మరికొంతమంది ఇంటివారలు (అహ్లెబైత్) అనే పదం హజ్రత్ ఫాతిమా, హజ్రత్ అలీ, హజ్రత్ హసన్, హుసైన్‌లకు మాత్రమే వర్తిస్తుందని అంటారు. ప్రవక్త సతీమణులను వారు ఈ పరిధినుంచి తీసేస్తారు. ఈ రెండు అభిప్రాయాలకు నడుమ మధ్యేమార్గం అవలంబించినట్లయితే 'ఇంటివారలు' అన్న పదంలో ఈ ఉభయులూ వచ్చేస్తారు. ఎందుకంటే ప్రవక్త సతీమణులు అహ్లెబైత్ పరిధిలోకి వస్తారని ఖుర్‌ఆన్ ద్వారా రూఢీ అవుతుండగా, అల్లుడూ, మనవళ్లు అహ్లెబైత్‌కి చెందినవారని ప్రామాణిక ఉల్లేఖనాల ద్వారా నిరూపితమవుతోంది. ఒకసారి దైవప్రవక్త (స) వారిని తన దుప్పటిలోకి తీసుకుని "ఓ అల్లాహ్! వీళ్లు నా ఇంటివారలు (కుటుంబీకులు)" అని పలికారు. దీనిభావమేమిటి? వీళ్లు కూడా నా ఇంటివారే అని ఆయన (స) చెప్పదలిచి ఉంటారు లేదా నా సతీమణులను నా ఇంటివారి జాబితాలో చేర్చినట్లు వీళ్ళను కూడా చేర్చు అని ఆయన (స) ప్రార్థించి ఉంటారు. ఈ విధంగా ఈ అంశానికి సంబంధించిన పలు ఆధారాల మధ్య విడదీయరాని బంధం ఏర్పడుతుంది. (మరిన్ని వివరాల కోసం అల్లామా షౌకానీచే విరచితమైన 'ఫత్‌హుల్ ఖదీర్'ని చూడండి).

71. అంటే – వాటి ప్రకారం ఆచరించండి. అరబీలో **'హిక్మత్'** (**الحكمة**) అని వుంది. హిక్మత్ అంటే హదీసులన్నమాట. ఈ ఆయతు ఆధారంగా కొంతమంది విద్వాంసులు ఏమంటారంటే, హదీసు కూడా ఖుర్‌ఆన్ మాదిరిగా పుణ్యార్జన సంకల్పంతో చదువవచ్చు. ప్రవక్త సతీమణులు కూడా 'ప్రవక్త ఇంటివారలు' పరిధిలోకి వస్తారన్న దానికి ఈ ఆయతు ప్రబల సాక్ష్యం. ఎందుకంటే దివ్య వాణి ప్రవక్త సతీమణుల ఇండ్లలో అవతరించేది. ముఖ్యంగా ఆయిషా (ర.అన్హా) కుటీరంలో అవతరించేదని హదీసుల ద్వారా తెలుస్తోంది.

إِنَّ الْمُسْلِمِينَ وَالْمُسْلِمَاتِ وَالْمُؤْمِنِينَ وَالْمُؤْمِنَاتِ
وَالْقَانِتِينَ وَالْقَانِتَاتِ وَالصَّادِقِينَ وَالصَّادِقَاتِ وَالصَّابِرِينَ
وَالصَّابِرَاتِ وَالْخَاشِعِينَ وَالْخَاشِعَاتِ وَالْمُتَصَدِّقِينَ
وَالْمُتَصَدِّقَاتِ وَالصَّائِمِينَ وَالصَّائِمَاتِ وَالْحَافِظِينَ
فُرُوجَهُمْ وَالْحَافِظَاتِ وَالذَّاكِرِينَ اللَّهَ كَثِيرًا
وَالذَّاكِرَاتِ أَعَدَّ اللَّهُ لَهُم مَّغْفِرَةً وَأَجْرًا عَظِيمًا ﴿٣٥﴾

**35** నిశ్చయంగా ముస్లిం పురుషులు– ముస్లిం స్త్రీలు,[72] విశ్వాసులైన పురుషులు – విశ్వాసులైన స్త్రీలు, విధేయులైన పురుషులు – విధేయులైన స్త్రీలు, సత్య సంధులైన పురుషులు – సత్యసంధులైన స్త్రీలు, సహనశీలురైన పురుషులు– సహనవతులైన స్త్రీలు, అణకువ గల పురుషులు – అణకువ గల స్త్రీలు, దాన ధర్మాలు చేసే పురుషులు – దానధర్మాలు చేసే స్త్రీలు, ఉపవాసం ఉండే పురుషులు– ఉపవాసం ఉండే స్త్రీలు, తమ మర్మాంగా లను కాపాడుకునే పురుషులు – కాపాడు కునే స్త్రీలు, అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించే పురుషులు – స్మరించే స్త్రీలు – వీరందరి కోసం అల్లాహ్ (విస్తృతమైన) మన్నింపును, గొప్ప పుణ్యఫలాన్ని సిద్ధం చేసి ఉంచాడు.

72. హజ్రత్ ఉమ్మె సలమా (ర.అన్హా) తదితర మహిళలకు ఒక ధర్మసందేహం కలిగింది– అల్లాహ్ ప్రతిసారీ పురుషులను సంబోధిస్తూనే ఆదేశాలిస్తాడేమిటీ? మహిళల్ని ఉద్దేశించి ఏమీ సెలవీయడేమిటి? అని. అప్పుడు ఈ ఆయతు అవతరించింది. (ముస్నదె అహ్మద్– 6/301; తిర్మిజీ – నెం.3211). ఈ ఆయతులో మహిళలను ఓదార్చటం జరిగింది. వాస్తవానికి దివ్య ఖుర్ఆన్‌లోని ఆదేశాలన్నీ పురుషులతోపాటు స్త్రీలకు కూడా వర్తిస్తాయి. కొన్నిచోట్ల ప్రత్యేకంగా స్త్రీలకు మాత్రమే వర్తించే ఆదేశాలు కూడా ఉన్నాయి. ఈ ఆయతు ద్వారా విదితమయ్యేదేమిటంటే దైవారాధన విషయంలోగానీ, దైవవిధేయతలోగానీ, పరలోక అంతస్థుల దృష్ట్యాగానీ స్త్రీ–పురుషులలో ఎలాంటి వ్యత్యాసాలు లేవు. ఇరువురి కోసం ఈ క్షేత్రం సమానంగా తెరువబడివుంది. ఇరువర్గాల వారిలో ఎవరయినాసరే తాము కోరినన్ని సత్కార్యాలు చేసి పుణ్యఫలాన్ని సంపాదించు కోవచ్చు. లింగ ప్రాతిపదికపై ఇక్కడ ఎలాంటి హెచ్చుతగ్గులు చేయబడవు. ముస్లింలను, విశ్వాసులను వేర్వేరుగా ప్రస్తావించటం కూడా గమనించదగిన అంశమే. వారిద్దరిలో కూడా కొంత వ్యత్యాసం ఉంది. విశ్వాస (ఈమాన్) స్థాయి ఇస్లాం స్థాయికన్నా ఉన్నతమైనదని ఖుర్ఆన్ హదీసుల ద్వారా రూఢీ అవుతోంది.

**36** (చూడండి) అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త ఏ వ్యవహారంలోనయినా ఒక నిర్ణయం చేసిన తరువాత విశ్వాసులైన ఏ పురుషునికిగానీ, స్త్రీకి గానీ తమకు వర్తించే ఆ వ్యవహారంలో ఎలాంటి స్వయం నిర్ణయాధికారం మిగిలి ఉండదు.[73] ఒకవేళ ఎవరైనా అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు అవిధేయత చూపితే అతను స్పష్టమైన అపమార్గానికి లోనైనట్లే (జాగ్రత్త!).

وَمَا كَانَ لِمُؤْمِنٍ وَلَا مُؤْمِنَةٍ إِذَا قَضَى اللّٰهُ وَرَسُولُهُ أَمْرًا أَنْ
يَكُونَ لَهُمُ الْخِيَرَةُ مِنْ أَمْرِهِمْ وَمَنْ يَعْصِ اللّٰهَ وَرَسُولَهُ فَقَدْ
ضَلَّ ضَلَالًا مُبِينًا ﴿٣٦﴾

**37** (ఓ ప్రవక్తా! ఆ సందర్భాన్ని కాస్త జ్ఞాపకం చేసుకో) అల్లాహ్ అనుగ్రహించిన వ్యక్తితో, నువ్వు సయితం ఉపకారం చేసిన వానితో "నువ్వు నీ భార్యను నీ దగ్గరే ఉండనివ్వు, అల్లాహ్‌కు భయపడు" అని చెప్పేవాడివి. కాని అల్లాహ్ బయటపెట్టాలని

وَإِذْ تَقُولُ لِلَّذِي أَنْعَمَ اللّٰهُ عَلَيْهِ وَأَنْعَمْتَ عَلَيْهِ أَمْسِكْ عَلَيْكَ
زَوْجَكَ وَاتَّقِ اللّٰهَ وَتُخْفِي فِي نَفْسِكَ مَا اللّٰهُ مُبْدِيهِ وَتَخْشَى

73. హజ్రత్ జైనబ్ (ర.అన్హా) వివాహం విషయంలో ఈ ఆయతు అవతరించింది. హజ్రత్ జైద్ బిన్ హారిస (రజి) అరబ్బు జాతీయులే అయినప్పటికీ బాల్యంలో ఎవరో ఆయన్ని పట్టుకుని బలవంతంగా బానిసగా అమ్మేశారు. మహాప్రవక్త (సఅసం) వివాహం హజ్రత్ ఖదీజా (ర.అన్హా)తో జరిగినప్పుడు, ఆమెగారు జైద్‌ను మహాప్రవక్త (స)కు కానుకగా ఇచ్చారు. అప్పుడు మహాప్రవక్త (స) జైద్‌కు బానిసత్వం నుంచి విముక్తిని ఇచ్చి, ఆయన్ని తన పెంపుడు కొడుకుగా చేసుకున్నారు. అంతేకాదు, తన మేనత్త కూతురైన హజ్రత్ జైనబ్ (ర.అన్హా)ను ఆయనకిచ్చి వివాహం జరిపించాలనుకున్నారు. జైనబ్ ఇంటికి వివాహ సందేశం పంపారు. కాని స్వేచ్ఛపొందిన ఒక బానిసతో వివాహం అనేసరికి జైనబ్‌గారు, ఆమె సోదరుడు ఆలోచనలో పడిపోయారు. జైనబ్‌గారు ఉన్నత వంశీయురాలు. ఆ సందర్భంగా ఈ ఆయతు అవతరించింది. దీని భావం ఏమిటంటే అల్లాహ్, ఆయన ప్రవక్త నిర్ణయం గైకొన్న తరువాత తమ అభిమతాన్ని చెలాయించాలనుకోవటం ఏ ముస్లిం పురుషునికిగానీ, స్త్రీకిగానీ ఎంతమాత్రం తగదు. పైగా వారు దేవుడు, దైవప్రవక్త ఆజ్ఞల ముందు తలవంచాలి. మనస్ఫూర్తిగా వాటిని పాలించాలి. ఈ ఆయతును విన్న తరువాత హజ్రత్ జైనబ్ (ర.అన్హా) తన నిర్ణయాన్ని మార్చుకొని, హజ్రత్ జైద్ (రజి)తో వివాహానికి సుముఖత వ్యక్తం చేశారు. అప్పుడు వారిద్దరి నికాహ్ జరిగింది.

النَّاسَ وَاللّٰهُ اَحَقُّ اَنْ تَخْشٰهُ فَلَمَّا قَضٰى زَيْدٌ مِّنْهَا وَطَرًا

ఉన్న ఒక విషయాన్ని నువ్వు నీ మనసు లోనే దాచిపెట్టావు. నువ్వు జనులకు భయపడేవాడివి. నిజానికి నువ్వు భయ పడటానికి అల్లాహ్యే ఎక్కువ హక్కుదారుడు.[74] మరి జైద్ ఆ స్త్రీతో తన

74. ఆ దంపతుల (జైద్ – జైనబ్‌ల) మనసులు కలవలేదు. తాను ఉన్నత వంశస్థురాలన్న భావం ఆమె మదిలో మెదలుతూ ఉండేది. జైద్ (రజి)పై బానిసత్వపు మచ్చ ఉండేది. తత్కారణంగా ఆ కాపురంలో కలతలు రేగాయి. ఆ మాటే తరచూ దైవప్రవక్త (స)కు చెబుతూ ఉండేవారు జైద్. తానామెకు విడాకులివ్వదలచినట్లు కూడా చెప్పేశారు. కాని దైవప్రవక్త (స) ఆయన్ని వారించారు. సర్దుకుపొమ్మని నచ్చజెప్పారు. అయితే అదే సమయంలో ఆ కాపురం ఎంతోకాలం నిలువదనీ, విడాకులు అనివార్యమని, విడాకుల అనంతరం జైనబ్‌తో దైవప్రవక్త (స)కు వివాహం జరిపించనున్నానని దేవుడు 'వహీ' పంపాడు. ఆ విధంగా ముస్లిం సమాజంలో కొనసాగుతూ వస్తున్న ఒక దురాచారాన్ని దేవుడు నిర్మూలించదలిచాడు. అదేమంటే దత్తపుత్రులను అరబ్బులు కన్నకొడుకులుగా తలపోసేవారు. కాని షరీయతు ప్రకారం దత్తపుత్రులు ఎట్టి పరిస్థితిలోనూ కన్నకొడుకులు కాజాలరు. దత్తపుత్రుల భార్యలు కోడళ్లు కాజాలరు. దత్తపుత్రులు విడాకులు ఇచ్చిన స్త్రీలను వివాహమాడటంలో సంకోచించాల్సిన అవసరం లేదు. ఈ విషయాన్ని ముస్లిం సమాజం ముందు తేటతెల్లం చేసే ఉద్దేశంతో అల్లాహ్ ఈ పరిణామాలను ఉత్పన్నం చేశాడు. దైవసంకేతం అందిన కొన్నాళ్ళకే హజ్రత్ జైద్ (రజి) తన భార్యకు విడాకులిచ్చేశారు.

హజ్రత్ జైద్ (రజి)పై అల్లాహ్ దయదలిచాడనటంలోని మర్మం ఏమిటంటే ఆయనకు ఇస్లాం స్వీకారభాగ్యాన్ని ప్రసాదించాడు. బానిస చెరనుంచి విముక్తిని వొసగాడు. ఇక దైవప్రవక్త (స) ఆయనకు చేసిన ఉపకారం ఏమిటంటే, ఆయనకు బానిసత్వం నుంచి స్వేచ్ఛను ప్రసాదించి, తన పెంపుడు కొడుకుగా చేసుకున్నారు. ఆయనకు ధార్మిక శిక్షణనిచ్చి, ఆయన జీవితాన్ని తీర్చిదిద్దారు. అంతేకాదు, స్వయాన తన మేనత్త ఉమైమాగారి పుత్రికతో ఆయన పెండ్లి జరిపించారు. కాని అనుకోని పరిణామాలు చోటు చేసుకున్నాయి. విడాకులు అనివార్యమయ్యాయి. అయితే ఈ పరిణామాల వెనుక దైవప్రణాళిక మరో విధంగా ఉంది.

విడాకుల అనంతరం జైనబ్‌తో దైవప్రవక్త (స) వివాహం జరిపించినట్లు దేవుడు సూచించాడు. కాని ఈ విషయాన్ని వ్యక్తపరచటానికి దైవప్రవక్త (స) తాత్సారం చేశారు. తాను తన కోడలిని వివాహమాడానని జనులు ఎక్కడ నిందిస్తారోనని ఆయన భయపడేవారు. (కాని దేవుడు తలచినది ఇంకొకటి. ఈ సంఘటన ద్వారా దేవుడు పాత ఆచారాన్ని శాశ్వతంగా రూపుమాప దలిచాడు). అలా భయపడటం సహజమే.

లాంఛనాలన్నీ పూర్తి చేసిన తరువాత,[75] మేము ఆమె వివాహం నీతో జరిపించాము.[76] దత్తపుత్రులు తమ భార్యల లాంఛనాలన్నీ పూర్తిచేసిన తరువాత[77] (వారికి విడాకులిచ్చిన పిమ్మట) వారి భార్యల (ను వివాహమాడే) విషయంలో ముస్లింలు ఎలాంటి సంకోచానికీ లోను కాకుండా ఉండేటందుకు మేమిలా చేశాము. అల్లాహ్ ఆజ్ఞ అమలు జరిగి తీరవలసిందే.[78]

زَوَّجْنٰكَهَا لِكَيْ لَا يَكُوْنَ عَلَى الْمُؤْمِنِيْنَ حَرَجٌ فِيْٓ اَزْوَاجِ اَدْعِيَاۗىِٕهِمْ اِذَا قَضَوْا مِنْهُنَّ وَطَرًا ۭ وَكَانَ اَمْرُ اللّٰهِ مَفْعُوْلًا ﴿٣٧﴾

**38** అల్లాహ్ తన ప్రవక్త కోసం నిర్ధారించిన దానిని ప్రవక్త అవలంబించటం ఏ విధంగానూ ఆక్షేపణీయం కాదు.[79] పూర్వం గతించిన వారిలో కూడా దేవుని ఈ సంప్రదాయమే ఉండేది.[80] అల్లాహ్

مَا كَانَ عَلَى النَّبِيِّ مِنْ حَرَجٍ فِيْمَا فَرَضَ اللّٰهُ لَهٗ ۭ سُنَّةَ اللّٰهِ فِي الَّذِيْنَ خَلَوْا مِنْ قَبْلُ ۭ وَكَانَ اَمْرُ اللّٰهِ قَدَرًا مَّقْدُوْرَا ﴿٣٨﴾

కాని జనులకు భయపడి దైవనిర్ణయాన్ని దాచి ఉంచటం సరికాదని అల్లాహ్ తన ప్రవక్తను సున్నితంగా మందలించాడు.

75. అంటే హజ్రత్ జైద్ తన భార్యకు విడాకులిచ్చిన తరువాత, ఆమె ఇద్దత్ కాలం పూర్తిచేసిన మీదట....

76. అంటే సుప్రసిద్ధ నికాహ్ పద్ధతికి భిన్నంగా దైవాదేశంపై వారిరువురి (దైవప్రవక్త – జైనబ్‌ల) నికాహ్ జరిగిపోయింది. అంటే నికాహ్ సదనం, సాక్షులు, సంరక్షకులు, మహర్ చెల్లింపు లాంటివి ఏమీ లేకుండానే వివాహం జరిగిపోయింది.

77. ఈ వివాహం తరువాత ముస్లిం సమాజంలో ఎవరూ తమ దత్తపుత్రులు విడాకులిచ్చిన స్త్రీలను వివాహమాడటంలో సందిగ్ధానికి లోనుకావలసిన అవసరం లేదు. ఈ వివాహం ధర్మసమ్మతమే అని అల్లాహ్ తేటతెల్లం చేయదలిచాడు.

78. అంటే దేవుడు ఈ మేరకు రాసిపెట్టాడు. అది అమల్లోకి రాకుండా ఎవరూ అడ్డుకోలేరు.

79. జైనబ్ (ర.అన్హా)తో దైవప్రవక్తకు జరిగిన వివాహాన్ని దృష్టిలో పెట్టుకునే ఈ ఆయతు అవతరించింది. ఈ వివాహం ధర్మబద్ధంగా జరిగింది. అందువల్ల దైవప్రవక్త (స) ఇందులో సంకోచానికి, తడబాటుకు లోనుకావలసిన అవసరం ఎంతమాత్రం లేదు.

80. గత కాలపు ప్రవక్తలు కూడా ఇలాంటి విషయాలలో సందిగ్ధానికి లోనయ్యేవారు కాదు. అల్లాహ్ తరఫున విధించబడిన పనిని వారు నిస్సంకోచంగా చేసేవారు. ఒకవేళ

ఆజ్ఞ నిర్ణీత లక్ష్యాలతో కూడుకున్నదై ఉంటుంది.[81]

الَّذِيْنَ يُبَلِّغُوْنَ رِسٰلٰتِ اللّٰهِ وَيَخْشَوْنَهٗ وَلَا يَخْشَوْنَ اَحَدًا اِلَّا اللّٰهَ ؕ وَكَفٰى بِاللّٰهِ حَسِيْبًا ﴿٣٩﴾

**39** వారంతా (దైవప్రవక్తలంతా) అల్లాహ్ సందేశాలను అందజేసేవారు. అల్లాహ్‌కు మాత్రమే భయపడేవారు. అల్లాహ్‌కు తప్ప వేరొకరికి భయపడేవారు కారు.[82] లెక్క తేల్చటానికి అల్లాహ్ ఒక్కడే చాలు.[83]

مَا كَانَ مُحَمَّدٌ اَبَآ اَحَدٍ مِّنْ رِّجَالِكُمْ وَلٰكِنْ رَّسُوْلَ اللّٰهِ

**40** (ప్రజలారా!) ముహమ్మద్ (సఅసం) మీ మగవారిలో ఎవరికీ తండ్రి కాడు.[84] అయితే ఆయన అల్లాహ్ యొక్క

ఆ పని ఆనాటి ఆచార సంప్రదాయాలకు విరుద్ధంగా ఉన్నా వారు జనులకు భయపడేవారు కారు.

81. దైవాదేశాలు యుక్తితో, పరమార్థంతో కూడుకుని ఉంటాయి. ప్రాపంచిక చక్రవర్తుల ఆదేశాల మాదిరిగా అవి తాత్కాలిక ప్రయోజనాల్ని ఆశించేవై ఉండవు.

82. అందుకే వారు దైవసందేశాన్ని అందించే సమయంలో ఒకరి ఆక్షేపణలకు వెరవకుండా, నిందలను లెక్క చేయకుండా సూటిగా వ్యవహరిస్తారు. పరిస్థితుల ప్రభావానికి లోనై ఒకరితో రాజీపడటం ప్రవక్తల విధానం కాదు.

83. దేవుడు తన శక్తియుక్తుల రీత్యా, జ్ఞానం రీత్యా సర్వత్రా ఉన్నాడు. అందువల్ల తన దాసులకు సహాయపడటానికి ఆయన ఒక్కడే చాలు. దైవసందేశ ప్రచార కార్యక్రమంలో ఎదురయ్యే అవరోధాలను ఆయన తొలగిస్తాడు. శత్రువుల కుటిల పన్నాగాల నుంచి, దుష్టసంకల్పాల బారినుంచి ఆయన వారిని కాపాడుతాడు.

84. కాబట్టి ఆయన (సఅసం) జైద్ బిన్ హారిసాకు కూడా తండ్రి కారు. ఒక్క జైద్ (రజి)కే కాదు, ఏ మగవానికి కూడా ఆయన తండ్రి కారు. వాస్తవానికి జైద్ (రజి) హారిసా కుమారులు. కాకపోతే దైవప్రవక్త (స) ఆయన్ని తన దత్తపుత్రునిగా చేసుకున్నారు. అందువల్ల అజ్ఞానకాలపు ఆచారం ప్రకారం ప్రజలు ఆయన్ని జైద్ బిన్ ముహమ్మద్ (స) అని పిలిచేవారు. అంతమాత్రం చేత ఆయన ప్రవక్తకు కన్న కొడుకు కాలేరుకదా! “దత్తపుత్రులను వారి తండ్రుల సంబంధంతోనే పిలవండి” అన్న ఆయతు అవతరించిన తరువాత ప్రజలు ఆయన్ని మళ్లీ జైద్ బిన్ హారిసా అనే పిలువసాగారు. అదలా వుంచితే దైవప్రవక్త (స)కు హజ్రత్ ఖదీజా (ర.అన్హా) ద్వారా ఖాసిమ్, తాహెర్, తయ్యిబ్ అనే ముగ్గురు మగపిల్లలు పుట్టారు. మారియా ఖిబ్తియా (ర.అన్హా) ద్వారా ఇబ్రాహీం అనే అబ్బాయి పుట్టాడు. కాని వీళ్ళంతా బాల్యంలోనే

సందేశహరుడు. ప్రవక్తల పరంపరను పరిసమాప్తం చేసే (చివరి) వాడు.[85] అల్లాహ్ ప్రతిదీ తెలిసినవాడు.

وَخَاتَمَ النَّبِيّٖنَ ۗ وَكَانَ اللّٰهُ بِكُلِّ شَيْءٍ عَلِيْمًا ﴿٤٠﴾

41 ఓ విశ్వాసులారా! అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించండి.

يٰٓاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوا اذْكُرُوا اللّٰهَ ذِكْرًا كَثِيْرًا ﴿٤١﴾

42 ఉదయం, సాయంకాలం ఆయన పవిత్రతను కొనియాడండి.

وَّسَبِّحُوْهُ بُكْرَةً وَّاَصِيْلًا ﴿٤٢﴾

43 మీపై తన కరుణానుగ్రహాలను పంపేవాడు ఆయనే. ఇంకా ఆయన దూతలు కూడా (మీపై కారుణ్యం కురవాలని ప్రార్థిస్తారు) – ఆయన మిమ్మల్ని చీకట్ల నుంచి వెలికితీసి వెలుగు వైపుకు తీసుకు వచ్చేటందుకు! అల్లాహ్ విశ్వాసుల పాలిట అపార కరుణామయుడు.

هُوَ الَّذِيْ يُصَلِّيْ عَلَيْكُمْ وَمَلٰٓئِكَتُهٗ لِيُخْرِجَكُمْ مِّنَ الظُّلُمٰتِ اِلَى النُّوْرِ ۗ وَكَانَ بِالْمُؤْمِنِيْنَ رَحِيْمًا ﴿٤٣﴾

44 వారు ఆయన్ని (అల్లాహ్‌ను) కలుసుకున్న రోజున, వారికి 'సలాం'తో స్వాగత

تَحِيَّتُهُمْ يَوْمَ يَلْقَوْنَهٗ سَلٰمٌ ۚ وَّاَعَدَّ لَهُمْ اَجْرًا كَرِيْمًا ﴿٤٤﴾

మరణించారు. వారిలో ఎవరూ యుక్తవయస్సుకు చేరలేదు. చెప్పవచ్చిందేమంటే ఆయన పిల్లల్లో ఎవరూ అబ్బాయిలు లేరు – ఆయన్ని తండ్రీ అని పిలవటానికి (ఇబ్నె కసీర్).

85. **'ఖాతమున్'** ( خَاتَم ) అంటే అసలు 'ముద్ర' అని అర్థం. ముద్ర అనేది ఒకానొక ప్రక్రియ పూర్తయ్యాక పడుతుంది. ముద్రపడిన తరువాత ఆ పని అన్ని విధాలా పూర్తయినట్లే లెక్క. అంటే ఆయన (సఅసం) రాకతో దైవదౌత్యపరంపరకు సీలు పడిపోయింది. కనుక మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) తరువాత ఎవరయినా తనను దైవప్రవక్తగా ప్రకటించుకుంటే అతను చాలా పెద్ద అబద్ధం చెప్పినట్లు లెక్క. హదీసులలో ఈ విషయం సవివరంగా చర్చించబడింది. యావత్తు ముస్లిం సమాజం ఈ విషయంపై ఏకాభిప్రాయం వ్యక్తం చేసింది. ప్రళయదినానికి ముందు హజ్రత్ ఈసా (అలైహిస్సలాం) దిగివస్తారని ప్రామాణిక ఉల్లేఖనాల ద్వారా తెలుస్తోంది. అయితే ఆయన ఒక ప్రవక్తగా కాకుండా, మహాప్రవక్త ముహమ్మద్ (స) అనుచర సమాజ సభ్యునిగా మాత్రమే వస్తారు. కాబట్టి ఈసా (అలైహిస్సలాం) రాక దైవదౌత్య పరిసమాప్తి సిద్ధాంతానికి విరుద్ధమైనది కాదు.

సత్కారాలు లభిస్తాయి.[86] వారి కోసం అల్లాహ్ గౌరవప్రదమైన పుణ్యఫలాన్ని సిద్ధం చేసి ఉంచాడు.

يَاَيُّهَا النَّبِيُّ اِنَّآ اَرْسَلْنٰكَ شَاهِدًا وَّمُبَشِّرًا وَّنَذِيْرًا ۝

**45** ఓ ప్రవక్తా! నిశ్చయంగా మేమే నిన్ను (ప్రవక్తగా ఎన్నుకుని) సాక్ష్యమిచ్చే వానిగా,[87] శుభవార్తలు వినిపించేవానిగా, హెచ్చరించేవానిగా చేసి పంపాము.

وَّدَاعِيًا اِلَى اللّٰهِ بِاِذْنِهٖ وَسِرَاجًا مُّنِيْرًا ۝

**46** ఇంకా – అల్లాహ్ ఆజ్ఞచే ఆయన వైపుకు పిలిచేవానిగా, వెలుగును విరజిమ్మే దీపంగా[88] (చేసి పంపాము).

وَبَشِّرِ الْمُؤْمِنِيْنَ بِاَنَّ لَهُمْ مِّنَ اللّٰهِ فَضْلًا كَبِيْرًا ۝

**47** విశ్వసించిన వారికి అల్లాహ్ తరఫున గొప్ప అనుగ్రహం ఉందన్న శుభవార్తను నువ్వు వారికి వినిపించు.

وَلَا تُطِعِ الْكٰفِرِيْنَ وَالْمُنٰفِقِيْنَ وَدَعْ اَذٰىهُمْ وَتَوَكَّلْ عَلَى اللّٰهِ ؕ
وَكَفٰى بِاللّٰهِ وَكِيْلًا ۝

**48** అవిశ్వాసుల, వంచకుల మాట వినకు. (వారి తరఫున జరిగే) వేధింపులను లెక్కచేయకు. అల్లాహ్నే నమ్ముకో. కార్య సాధకునిగా అల్లాహ్ (ఒక్కడే) చాలు.

86. అంటే, స్వర్గంలో దైవదూతలు విశ్వాసులకు సలాం చేసి స్వాగతం పలుకుతారు. లేదా విశ్వాసులు పరస్పరం సలాం చెప్పుకుంటారు.

87. కొంతమంది **'సాక్షి'** (షాహిద్) అనే పదాన్ని ప్రత్యక్షమై ఉండేవాడు, చూస్తూ ఉండేవాడు అన్న అర్థాల్లో తీసుకున్నారు. ఇది సరైనది కాదు. (అసలు అర్థం ఏమిటంటే) దైవప్రవక్త (స) తన అనుచర సమాజం కొరకు సాక్షిగా ఉంటారు. తనను విశ్వసించిన వారికోసం, తనను ధిక్కరించిన వారి కోసం కూడా సాక్షిగానే ఉంటారు. ప్రళయదినాన ఆయన (సఅసం) విశ్వాసులను, 'వుజూ'తో తడిసిన వారి శరీర భాగాల ఆధారంగా గుర్తుపడ తారు. అదేవిధంగా ఆయన ఇతర ప్రవక్తల కర్తవ్య నిర్వహణను గురించి సాక్ష్యమిస్తూ, వారు తమ బాధ్యతను సజావుగా నిర్వర్తించారని చెబుతారు. అల్లాహ్ వొసగిన వాస్తవిక పరిజ్ఞానం ఆధారంగా ఆయన (స) ఈ సాక్ష్యం ఇస్తారు. అంతేగాని ఆ ప్రవక్తలందరినీ తన కళ్ళతో చూసినందున కాదు.

88. దీపపు వెలుగు ద్వారా చీకట్లు ఎలా దూరమవుతాయో అలాగే ఆయన (సఅసం) కృషి ద్వారా అవిశ్వాసం, బహుదైవోపాసనా చీకట్లు తొలగిపోయాయి. ఈ దీపం

**49** ఓ విశ్వాసులారా! మీరు విశ్వాసులైన స్త్రీలను వివాహమాడినపుడు, వారిని తాకకముందే మీరు వారికి విడాకులిస్తే, అట్టి పరిస్థితిలో మీరు లెక్కించే గడువు కాలం (ఇద్దత్) పూర్తిచేయమని వారిని కోరే అధికారం మీకు లేదు.[89] కాబట్టి వారికి

يَاأَيُّهَا الَّذِينَ آمَنُوا إِذَا نَكَحْتُمُ الْمُؤْمِنَاتِ ثُمَّ طَلَّقْتُمُوهُنَّ مِن قَبْلِ أَن تَمَسُّوهُنَّ فَمَا لَكُمْ عَلَيْهِنَّ مِنْ عِدَّةٍ

ప్రళయదినం వరకూ తన వెలుగును విరజిమ్ముతూ ఉంటుంది. దీన్నుంచి ఎవరెంత జ్యోతిని పొందదలచుకుంటే అంతగా పొందవచ్చు.

89. వివాహమాడిన స్త్రీలతో సమాగమం జరిపిన తరువాత విడాకులిస్తే, విడాకులిచ్చే సమయానికి వారు పడచువారుగానే ఉంటే – అట్టి పరిస్థితిలో – వారి గడువు (ఇద్దత్) కాలం మూడు రుతువులు (అల్ బఖర – 228). అయితే ఈ ఆయతులో వివాహమాడిన తరువాత భర్తతో సంభోగం జరపని స్త్రీల గురించి చెప్పబడింది. అలాంటి స్త్రీలకు గనక విడాకులిస్తే వారిపై ఇద్దత్ ఆంక్షలు ఉండవు. ఆ స్థితిలో విడాకులు పొందిన స్త్రీలు ఎలాంటి నిరీక్షణ చేయకుండా వెంటనే వివాహం చేసుకోవచ్చు. అయితే సమాగమం జరపకముందే భర్త మరణించినపక్షంలో ఆమె పూర్తిగా నాలుగు మాసాల పది రోజులు ఇద్దత్ (గడువు) పూర్తిచేయాల్సి ఉంటుంది (ఫత్హుల్ ఖదీర్, ఇబ్నె కసీర్). ముట్టుకోవటం అన్నా, చేత్తో తాకటం అన్నా – ఇవన్నీ సంభోగం నేపథ్యంలో చెప్పబడినవే. **'నికాహ్'** అనే పదం ఇక్కడ వివాహ ఒప్పందం అనే భావంలో ఉంది. అందుకే నికాహ్‌కు ముందు తలాఖ్ ప్రసక్తే రాదని ఈ ఆయతు ద్వారా స్పష్టంగా విదితమవుతోంది. ఎట్టి పరిస్థితిలోనూ వివాహం జరిగిన తరువాతే విడాకుల ప్రసక్తి వస్తుంది. కనుక ఎవరయినా 'నేను ఫలానా స్త్రీని వివాహమాడిన తరువాత ఆమెకు తలాఖ్ ఇచ్చినట్లే' అని నోటితో ప్రకటిస్తే, అది తలాఖ్ ఇచ్చినట్లు కాదు. అలాగే ఎవరయినా 'నేను ఏ స్త్రీని వివాహమాడినాసరే, వివాహమాడిన పిదప ఆమెకు విడాకులిచ్చినట్లే'నని అర్థంలేని ప్రకటన చేసినంత మాత్రాన విడాకులు కావు. కొంతమంది ధర్మవేత్తలు (ఫుకహా) ఈ మాట మూలంగా కూడా "విడాకులు అయిపోతాయి" అని తమదైన భాష్యం చెప్పుకు వచ్చారు. కాని ఇది సరైనది కాదు. దైవవాక్యాలతో, దేవుని షరీయతుతో చెలగాటమాడే ప్రయత్నం చేయరాదని గట్టిగా తాకీదు చేయబడింది. హదీసులో ఇలా ఉంది: "నికాహ్‌కు ముందు తలాఖ్ (విడాకుల) ప్రసక్తే లేదు" (ఇబ్ను మాజ). మరో హదీసులో ఇలా అనబడింది: ఆదం పుత్రుడు ఏ వస్తువుకు యజమాని కాడో దానిపై అతనికి తలాఖ్ అధికారం లేదు (అబూ దావూద్, తిర్మిజీ, ఇబ్నెమాజ, ముస్నదె అహ్మద్ – 2/189). నికాహ్‌కు పూర్వం తలాఖ్ అనేది ఒక వెకిలిచేష్ట అనీ, షరీయతులో దానికెలాంటి స్థానమూ లేదని ఈ హదీసుల ద్వారా రూఢీ అవుతోంది.

ఎంతో కొంత ముట్టజెప్పి[90] ఉత్తమ రీతిలో సాగనంపండి.[91]

**50** ఓ ప్రవక్తా! నువ్వు మహర్ సొమ్మును చెల్లించిన నీ భార్యలను నీ కోసం ధర్మ సమ్మతం చేశాము.[92] ఇంకా – విజయ ప్రాప్తిగా అల్లాహ్ నీకు ప్రసాదించినబానిస స్త్రీలను,[93] నీతోపాటు వలసవచ్చిన[94] నీ పినతండ్రి, పెత్తండ్రి కుమార్తెలను, నీ మేనత్తల పుత్రికలను, నీ మేనమామ కూతు ళ్ళను, నీ పిన్నమ్మ, పెద్దమ్మల కుమార్తె

تَعْتَدُّوْنَهَا ۚ فَمَتِّعُوْهُنَّ وَسَرِّحُوْهُنَّ سَرَاحًا جَمِيْلًا ﴿٤٩﴾

يٰٓاَيُّهَا النَّبِيُّ اِنَّآ اَحْلَلْنَا لَكَ اَزْوَاجَكَ الّٰتِيْٓ اٰتَيْتَ
اُجُوْرَهُنَّ وَمَا مَلَكَتْ يَمِيْنُكَ مِمَّآ اَفَآءَ اللّٰهُ عَلَيْكَ
وَبَنٰتِ عَمِّكَ وَبَنٰتِ عَمّٰتِكَ وَبَنٰتِ خَالِكَ وَبَنٰتِ

90. దీన్ని ముత్ఆ అంటారు. మహర్ ముందుగానే నిర్ణయించబడి వున్న పక్షంలో సగం మహర్ ఇవ్వవలసి ఉంటుంది. ఒకవేళ మహర్ నిర్ణయించబడని పక్షంలోనైతే తమ స్థోమతను బట్టి ఎంతోకొంత ఇచ్చి సాగనంపాలి.

91. అంటే వారిని భయపెట్టడంగానీ, వేధించటంగానీ చేయకుండా, వారిని నలుగురిలో నవ్వులపాలు చేసే ప్రయత్నం చేయకుండా సగౌరవంగా సెలవు ఇవ్వాలి. వీలైతే వారికి కొంత ఆర్థిక సహాయంగానీ, లేదా కానుకల రూపేణా ఏదైనా ఇచ్చిగానీ వదలిపెట్టాలి.

92. కొన్ని షరీయతు ఆదేశాలలో దైవప్రవక్త (స) కు ప్రత్యేకత వొసగబడింది. ఉదాహ రణకు: తహజ్జుద్ నమాజు ఆయన (స) కొరకు విధి (ఫర్జ్)గా చేయబడిందని పండితుల్లో ఒక వర్గం అభిప్రాయపడుతోంది. అలాగే దానధర్మాలు పుచ్చుకోవటం ఆయన (స) కొరకు నిషేధించబడింది. అలాగే ఆయన (స)కు మాత్రమే వర్తించే మరికొన్ని ప్రత్యేక ఆజ్ఞలను దివ్య ఖుర్ఆన్ పేర్కొంది. వాటిలో నికాహ్ విషయం కూడా ఉంది. ఆయన (స) 'మహర్' సొమ్మును చెల్లించిన స్త్రీలు – వారెందరయినాసరే – ఆయన కొరకు ధర్మసమ్మతమే. యుద్ధ ఖైదీలుగా వచ్చిన హజ్రత్ సఫియా (ర.అ), హజ్రత్ జువైరియా (ర.అ)లను ఆయన విడుదల చేసి దాన్నే 'మహర్'గా ఖరారు చేశారు. మిగిలిన భార్యలందరికీ నగదు రూపంలో మహర్ చెల్లించారు. ఒక్క ఉమ్మె హబీబా (ర.అన్హా) మహర్‌ను మాత్రం నజాషీ చక్రవర్తి తన తరపున చెల్లించాడు.

93. హజ్రత్ సఫియా, హజ్రత్ జువేరియా విజయ ప్రాప్తిగా ఆయన (స) వాటాలోకి రాగా, ఆయన (స) వారిద్దరికీ స్వేచ్ఛను ప్రసాదించి, నికాహ్ చేసుకున్నారు. రైహానా (ర.అన్హా), మారియా ఖిబ్తియా (ర.అన్హా)లు బానిస స్త్రీలుగా ఆయన స్వాధీనంలోకి వచ్చారు.

94. 'నీతోపాటు వలస వచ్చిన స్త్రీలు' అంటే మక్కానుంచి మదీనాకు దైవమార్గంలో హిజ్రత్

خَالِصَةً لَّكَ مِن دُونِ الْمُؤْمِنِينَ قَدْ عَلِمْنَا ... (Arabic verse text)

లను కూడా నీకు ధర్మసమ్మతం చేశాము. మరి విశ్వసించిన ఒక స్త్రీ తనను తాను దైవప్రవక్తకు అర్పించుకోదలిస్తే – అట్టి పరిస్థితిలో దైవ ప్రవక్త కూడా ఆమెను పెండ్లాడదలిస్తే[95]– పెండ్లాడవచ్చు. (ఓ ప్రవక్తా!) ఈ మినహాయింపు విశ్వాసు లందరికీ కాకుండా నీకొక్కనికే ప్రత్యేకం.[96] సాధారణ ముస్లింలకు వారి భార్యల, వారి బానిస స్త్రీల విషయంలో ఏ ఏ ఆదేశాలను నిర్ధారించి ఉన్నామో మాకు బాగా తెలుసు.[97] నీకెలాంటి ఇబ్బందీ కలుగ కుండా ఉండేటందుకే[98] (మేము నీకు ప్రత్యేక రాయితీలు ప్రకటించాము). అల్లాహ్ ఎంతగానో క్షమించేవాడు, మరెంతగానో కరుణించేవాడు.

చేసినవారని భావం. నిజానికి దైవప్రవక్త (స) వెంట వారెవరూ హిజ్రత్ చేయలేదు. వారంతా తరువాత వచ్చినవారే.

95. తనను తాను దైవప్రవక్తకు 'హిబా' చేసుకోవటానికి (తనను సమర్పించుకోవటానికి) ఏ ముస్లిం స్త్రీ అయినా ముందుకు వస్తే, దైవప్రవక్త (స) కూడా ఆమెను వివాహ మాడటానికి సుముఖంగా ఉన్నపక్షంలో – మహర్ చెల్లించకుండానే – ఆమెను వివాహమాడటానికి దైవప్రవక్త (స)కు అనుమతి ఇవ్వబడింది.

96. ఈ రకమయిన అనుమతి ఒక్క దైవప్రవక్త (స)కు మాత్రమే పరిమితం, ప్రత్యేకం. ఈ ఆదేశం సాధారణ ముస్లింలకు వర్తించదు. సాధారణ ముస్లింలు ఏ స్త్రీని వివాహ మాడదలచినా మహర్‌ను విధిగా చెల్లించాల్సిందే.

97. అంటే – నికాహ్ విషయంలో మేము సాధారణ ముస్లింలపై కొన్ని ఆంక్షలను నిర్ధారిం చాము. ఉదాహరణకు : ముస్లిం పురుషులు ఏకకాలంలో నలుగురు మహిళలకు మించి తన వివాహబంధంలో ఉంచలేరు. అలాగే వారు ఎవరిని వివాహమాడినా దానికోసం మహిళ తరఫునుంచి ఒక వ్యక్తి వలీ (సంరక్షకుడు)గా ఉండాలి. ఇద్దరు సాక్షులుండాలి. అయితే ధర్మబద్ధంగా స్వాధీనంలోకి వచ్చిన బానిస స్త్రీల సంఖ్యపై మాత్రం ఎలాంటి పరిమితి లేదు. కాని ప్రస్తుతం బానిస స్త్రీల సమస్యే లేదు.

98. ప్రవక్త (స) పట్ల అవలంబించబడిన సడలింపుల వైఖరికి కారణం ఇక్కడ తెలుప బడింది. ఆనాటి పరిస్థితుల దృష్ట్యా, ఉమ్మత్‌కు (ముస్లిం సమాజానికి) ఒనగూడ

**51** (ఓ ముహమ్మద్ – స! వంతుల విషయంలో) వారిలో నువ్వు కోరిన వారిని దూరంగా ఉంచవచ్చు. నువ్వు కోరిన వారిని నీ దగ్గర ఉంచుకోవచ్చు.[99] ఒకవేళ నువ్వు దూరంగా ఉంచిన వారిలో కూడా ఎవరినయినా నువ్వు నీ దగ్గరకు పిలుచుకుంటే నీపై ఏ దోషమూ లేదు.[100] దీనిద్వారా వారి కళ్లు చల్లబడతాయనీ, వారు ఆవేదన చెందకుండా ఉంటారనీ, నువ్వు వారికి ఏది ఇచ్చినా దానిపై వారంతా సంతృప్తి చెందుతారని ఎక్కువగా ఆశించవచ్చు.[101]

تُرْجِي مَنْ تَشَآءُ مِنْهُنَّ وَتُـْٔوِيٓ إِلَيْكَ مَنْ تَشَآءُ وَمَنِ ابْتَغَيْتَ
مِمَّنْ عَزَلْتَ فَلَا جُنَاحَ عَلَيْكَ ذٰلِكَ أَدْنٰىٓ أَنْ تَقَرَّ أَعْيُنُهُنَّ

వలసివున్న ఇతోధిక ప్రయోజనాల దృష్ట్యా దేవుడు తన ప్రవక్తకు ఈ వెసులుబాటును కల్పించాడు.

99. ఆయన (సఅసం) గారి ఇంకొక ప్రత్యేకత కూడా ఈ ఆయతులో తెలుపబడింది. అదేమిటంటే భార్యల మధ్య వంతులను నిర్ధారించటంలో ఆయన (స)కు స్వేచ్ఛాధికారం వొసగబడింది. ఏ భార్య వంతునైనా ఆయన (స) కొంతకాలం పాటు వాయిదా వేయదలిస్తే వేయవచ్చు. అంటే ఆమెను తన వివాహబంధంలోనే ఉంచి, ఆమెతో సమాగమం జరపకుండా ఉండవచ్చు. అలాగే తాను కోరిన భార్యతో సమాగమం జరపవచ్చు.

100. అంటే, ఆయన (స) తాత్కాలికంగా దూరంగా ఉంచిన భార్యలలో ఎవరినయినాసరే తానిష్టపడ్డప్పుడు తన దగ్గరకు పిలుచుకుని ఆమెతో సమాగమం జరపవచ్చు.

101. వంతుల నిర్ధారణలో ఆయన (స)కు పూర్తి స్వేచ్ఛ వొసగబడినప్పటికీ ఆయన భార్యలు సంతోషంగానే ఉంటారనీ, దుఃఖితులు అవరనీ, దైవప్రవక్త (స) వారికి ఇచ్చే దానిపై వారు సంతోషిస్తారని ఆశించబడింది. ఎందుకు? ఎందుచేతనంటే దైవప్రవక్త (స) ఏం చేసినా తన మనోవాంఛలతో నిమిత్తం లేకుండా దైవేచ్ఛ ప్రకారమే చేస్తారన్న సంగతి వారికి తెలుసు. దైవేచ్ఛపై వారంతా సంతుష్టులై ఉన్నారు.

ఈ వాక్యం నేపథ్యంలో మరికొంతమంది వ్యాఖ్యాతలు ఇలా అభిప్రాయపడ్డారు : "దేవుని తరఫున ఈ నిర్ణయాధికారం లభించినప్పటికీ దైవప్రవక్త (స) దాన్ని ఉపయోగించుకోలేదు – ఒక్క సౌదా (ర.అన్హా) విషయంలో తప్ప! హ్జ్రత్ సౌదా (ర.అన్హా) గారైనా ఇష్టపూర్వకంగా తన వంతును హ్జ్రత్ ఆయిషా (ర.అన్హా)కు కానుకగా ఇచ్చుకున్నారు. ఆయన (స) మాత్రం తన సతీమణుల వంతులను ఖచ్చితంగా

وَلَا يَحْزَنَّ وَيَرْضَيْنَ بِمَآ اٰتَيْتَهُنَّ كُلُّهُنَّ وَاللّٰهُ يَعْلَمُ مَا
فِيْ قُلُوْبِكُمْ وَكَانَ اللّٰهُ عَلِيْمًا حَلِيْمًا ﴿٥١﴾

మీ హృదయాలలో ఏముందో అల్లాహ్‌కు (బాగా) తెలుసు.[102] అల్లాహ్ అన్నీ తెలిసిన వాడు, సహనశీలుడు.

لَا يَحِلُّ لَكَ النِّسَآءُ مِنْ بَعْدُ وَلَآ اَنْ تَبَدَّلَ بِهِنَّ
مِنْ اَزْوَاجٍ وَّلَوْ اَعْجَبَكَ حُسْنُهُنَّ اِلَّا مَا مَلَكَتْ

**52** ఇక దీని తరువాత, వేరితర స్త్రీలు నీ కొరకు ధర్మసమ్మతం కారు. వీరికి బదులుగా ఇతర స్త్రీలను భార్యలుగా చేసుకోవటం కూడా నీకు సమ్మతం కాదు – వారి అందచందాలు నీకు ఎంత నచ్చినాసరే![103] అయితే (విజయ

నిర్ధారించి, శాయశక్తులా దానికి కట్టుబడి ఉండేవారు. అయితే మరణానికి కొన్ని రోజుల ముందు తీవ్రంగా వ్యాధిగ్రస్తులైనపుడు మాత్రం భార్యలందరి సమ్మతిపై ఆయిషా (ర.అన్హా) దగ్గరే ఉండిపోయారు. ఆయన (స) గారి ఈ న్యాయశీలతపై ఆయన సతీమణులు సంతోషపడ్డారు. వంతుల నిర్ధారణలో ఆయన (స)కు దేవుడు పూర్తి స్వేచ్ఛ ఇచ్చినప్పటికీ దాన్ని ఆయన అవలంబించలేదు. సతతం ఆయన (స) భార్యల మనసులను జయించి, వారందరినీ సుఖపెట్టడానికే ప్రయత్నించారు.

102. భార్యలందరిపట్ల సమానమైన ప్రేమ మనసులో ఉండదన్న సంగతి దైవానికి తెలుసు. మనిషి భౌతికంగా భార్యలందరికీ వారి హక్కులను సమానంగా ఇచ్చినప్పటికీ మానసికంగా కొందరి వైపు అధికంగా మొగ్గుతాడు. ఉదాహరణకు : అన్న వస్త్రాలను సమకూర్చటంలో, వసతి సౌకర్యం కల్పించటంలో, వారి ఇతర జీవనావసరాలను సరఫరా చేయటంలో సమానంగా వ్యవహరించటం సంభవమే. కాని మనసుపై అదుపు అతని వల్ల సాధ్యం కాదు. అందుకే దేవుడు ఈ మానసిక దౌర్బల్యాన్ని తీవ్రంగా పరిగణించటం లేదు. అందుకే మహనీయ ముహమ్మద్ (సఅసం) వారు తరచూ ఇలా వేడుకునేవారు : "అల్లాహ్! నా అధీనంలో వున్న విషయాన్ని నేను (న్యాయంగానే) విభజించాను. మరి దేనిపై నీకు అదుపు అధికారం ఉన్నాయో దానిపై నాకు అదుపు లేదు. ఈ విషయంలో నన్ను నిందార్హునిగా చేయకు" (అబూ దావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్ను మాజ, ముస్నదె అహ్మద్ – 6/144).

103. తమకు ఎట్టి పరిస్థితిలోనూ దైవం మరియు దైవప్రవక్తే కావాలని, ప్రవక్తతో నిరాడంబర జీవితం గడపటానికే తాము నిర్ణయించుకున్నామని ప్రవక్త సతీమణులంతా స్పష్టంగా చెప్పటాన్ని దేవుడు మెచ్చాడు. దానికి బదులుగా ఇకమీదట దైవప్రవక్త (ఈ తొమ్మండుగురు భార్యలు కాకుండా) వేరితర స్త్రీలను వివాహమాడటాన్ని నిషేధించాడు. ఆ భార్యలలో ఏ ఒక్కరికయినా విడాకులిచ్చి ఆమె స్థానంలో వేరొకామెను చేసుకోవటాన్ని కూడా వారించాడు. ఆయన (స)కు ఎంపిక స్వేచ్ఛ ఇవ్వబడినా ఆయన (స) మాత్రం ఎవరినీ నికాహ్ చేసుకోలేదని మరికొందరు భావిస్తున్నారు (ఇబ్నె కసీర్).

يَمِيْنُكَ ۚ وَكَانَ اللّٰهُ عَلٰى كُلِّ شَىْءٍ رَّقِيْبًا ۝٥٢

(ప్రాప్తిగా) నీ స్వాధీనంలోకి వచ్చినవారైతే అది వేరేవిషయం.[104] అల్లాహ్ అన్నింటినీ కనిపెట్టుకుని ఉన్నాడు సుమా!

يٰٓاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا لَا تَدْخُلُوْا بُيُوْتَ النَّبِىِّ اِلَّآ اَنْ يُّؤْذَنَ لَكُمْ اِلٰى طَعَامٍ غَيْرَ نٰظِرِيْنَ اِنٰىهُ وَلٰكِنْ اِذَا دُعِيْتُمْ فَادْخُلُوْا فَاِذَا طَعِمْتُمْ فَانْتَشِرُوْا وَلَا مُسْتَاْنِسِيْنَ لِحَدِيْثٍ ۭ اِنَّ ذٰلِكُمْ كَانَ يُؤْذِى النَّبِىَّ فَيَسْتَحْىٖ مِنْكُمْ ۡ وَاللّٰهُ لَا يَسْتَحْىٖ مِنَ الْحَقِّ ۭ وَاِذَا سَاَلْتُمُوْهُنَّ مَتَاعًا

**53** ఓ విశ్వాసులారా! మీకు అనుమతి లేనిదే మీరు ప్రవక్త ఇండ్లలోకి వెళ్ళకండి. భోజనార్థం మీకు పిలుపు అందినపుడు మాత్రం వెళ్ళండి. అయితే భోజనం తయారయ్యేవరకు వేచి ఉండే విధంగా కాదు. మరి భోజనం చేసిన వెంటనే బయలుదేరండి. కబుర్లు చెప్పు కుంటూ అక్కడే ఉండిపోకండి. ఈ రకమయిన మీ ప్రవర్తన వల్ల ప్రవక్తకు బాధ కలుగుతుంది. మొహమాటంకొద్దీ అతను మీకేమీ చెప్పడు. అయితే అల్లాహ్ మాత్రం నిజం చెప్పటానికి మొహమాట పడడు.[105] మీరు ప్రవక్త సతీమణులను

104. అంటే ధర్మబద్ధంగా తన వాటాలోనికి వచ్చిన బానిస స్త్రీలను ఎంతమందినయినా చేసుకోవచ్చు. అవిశ్వాస బానిస స్త్రీలు కూడా ఈ పరిధిలోనికి వస్తారని కొంత మంది అభిప్రాయపడ్డారు. అయితే అల్ ముమ్తహినా సూరా 10వ ఆయతు దృష్ట్యా ఆయన (స) కొరకు ఇది సమ్మతం కాదని మరికొంతమంది వ్యాఖ్యానించారు (ఫత్‌హుల్ ఖదీర్).

105. ఈ ఆయతు అవతరణ వెనుక ఉన్న ముఖ్యకారణం ఇది : దైవప్రవక్త (సఅసం) హజ్రత్ జైనబ్ (ర.అన్హా)ను వివాహమాడినపుడు తన ప్రియ సహచరులను వలీమా విందుకు ఆహ్వానించారు. ఆ సందర్భంగా ప్రవక్త సహచరుల్లో కొందరు భోజనా లయ్యాక కూడా అక్కడే కూర్చుని మాటల్లో నిమగ్నులైపోయారు. ఈ ధోరణి వల్ల దైవప్రవక్త (స)కు ఇబ్బంది కలిగింది. అయినాసరే బిడియం వల్ల, తనలోని సద్గుణం వల్ల ఆయన తన సహచరులను వెళ్ళమని చెప్పలేకపోయారు (సహీహ్ బుఖారీ – అల్ అహ్జాబ్ సూరా వ్యాఖ్యానం). అందువల్ల ఈ ఆయతులో సహచరులకు విందు 'మర్యాదలు' తెలుపబడ్డాయి: 1. భోజనం సిద్ధమైన తర్వాతే వెళ్ళాలి. అంతేగాని భోజన సమయానికి ముందే వెళ్ళి తిష్ఠవేయటం వాంఛనీయం కాదు. 2. భోజనం చేయగానే తమ తమ ఇండ్లకు తిరిగి రావాలి. పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ అక్కడే చాలాసేపు

فَسْـَٔلُوْهُنَّ مِنْ وَّرَآءِ حِجَابٍ ۚ ذٰلِكُمْ اَطْهَرُ لِقُلُوْبِكُمْ وَقُلُوْبِهِنَّ ۚ وَمَا كَانَ لَكُمْ اَنْ تُؤْذُوْا رَسُوْلَ اللّٰهِ وَلَآ اَنْ تَنْكِحُوْٓا اَزْوَاجَهٗ مِنْ بَعْدِهٖٓ اَبَدًا ۚ اِنَّ ذٰلِكُمْ كَانَ عِنْدَ اللّٰهِ عَظِيْمًا ﴿٥٣﴾

ఏదైనా అడగవలసి వచ్చినప్పుడు తెర వెనుక నుంచి అడగండి.[106] మీ ఆంతర్యాల, వారి హృదయాల పరిశుద్ధత కోసం ఇదే సముచితమైన పద్ధతి.[107] దైవప్రవక్తకు మనస్తాపం కలిగించటంగానీ,[108] అతని తదనంతరం అతని భార్యలను వివాహమాడటంగానీ ఎన్నటికీ మీకు ధర్మ సమ్మతం కాదు. అల్లాహ్ దృష్టిలో ఇది మహాపాతకం (అని తెలుసుకోండి).[109]

కూర్చోకూడదు. విందు భోజనం నేపథ్యంలో ఈ ఆయతు అవతరించినప్పటికీ ఇతరత్రా ఆహ్వానాలకు, సమావేశాలకు కూడా ఈ 'మర్యాదలు' వర్తిస్తాయి. విందు నిమిత్తం మిమ్మల్ని ఆహ్వానించినా, వేరితర పనుల నిమిత్తం ఆహ్వానం అందినా ఆ ఇంటివారి అనుమతి పొందకుండా ఇంటిలోపలికి జొరబడకూడదు.

106. హజ్రత్ ఉమర్ (రజి) మనోరథంపై ఈ ఆదేశం అవతరించింది. ఒకసారి హజ్రత్ ఉమర్ (రజి) వచ్చి, "ఓ దైవప్రవక్తా (సఅసం)! మీ దగ్గరకు రకరకాల మనుషులు వస్తుంటారు. వారిలో మంచివాళ్లూ ఉంటారు. చెడ్డవాళ్ళూ ఉంటారు. అలాంటప్పుడు మీరు పరదాను పాటించమని మా మాతల (ఉమ్మహాతుల్ మోమినీన్)కు ఆజ్ఞాపిస్తే బావుంటుందేమో కదా!" అన్నారు. అప్పుడు అల్లాహ్ ఈ ఆయతును అవతరింపజేశాడు (సహీహ్ బుఖారీ – కితాబుస్సలాత్; ముస్లిం – బాబు ఫజాయెల్ ఉమర్ బిన్ ఖత్తాబ్).

107. **'పరదా'** ఉత్తర్వు వెనుక ఉన్న పరమార్థం ఇందులో చెప్పబడింది. దీనివల్ల అటు పురుషుల మనసులు గానీ, ఇటు స్త్రీల మనసులు గానీ కల్మషానికి, సంశయానికి లోనవకుండా ఉంటాయి. ఆంతర్యాలలో దురాలోచనలు జనించకుండా ఉంటాయి.

108. మనస్తాపం ఏ రకంగా కలిగించినా మనస్తాపమే. ఉదాహరణకు : అనుమతి పొందకుండా ఆయన (స) ఇండ్లలోనికి వెళ్ళినా, ఆయన (స)కు ఇష్టంలేకపోయినా చాలా సేపటి వరకు ఆయన ఇంట్లో బైఠాయించినా, పరదా ఆదేశాలను ఉల్లంఘించి ఆయన (స) సతీమణులతో మాట్లాడినా – ఇవన్నీ బాధాకరమే. వీటి మూలంగా ప్రవక్త (స) మనసు నొచ్చుకుంటుంది. కాబట్టి ఇలాంటి చేష్టలను మానుకోవాలి.

109. దైవప్రవక్త (స) మరణించేనాటికి ఆయన దాంపత్య జీవితంలో ఉన్న సతీమణులందరి విషయంలోనూ ఈ ఆజ్ఞ వర్తిస్తుంది. అయితే ప్రవక్త (స)తో నికాహ్ జరిగిన తరువాత,

**54** మీరేదన్నా విషయాన్ని బాహాటం చేసినా లేక గోప్యంగా ఉంచినా – అల్లాహ్ మాత్రం ప్రతిదీ తెలిసినవాడు.

إِن تُبْدُوا شَيْئًا أَوْ تُخْفُوهُ فَإِنَّ اللَّهَ كَانَ بِكُلِّ شَيْءٍ عَلِيمًا ﴿٥٤﴾

**55** ఆ స్త్రీలు (ప్రవక్త సతీమణులు) తమ తండ్రుల, తమ కుమారుల, తమ సోదరుల ఎదుట, తమ సహోదరుల పుత్రుల ఎదుట, తమ అక్కాచెల్లెళ్ళ కొడుకుల ఎదుట, తమతో కలసిమెలసి ఉండే స్త్రీల ఎదుట, తమ యాజమాన్యంలో వున్నవారి (బానిసల, బానిస స్త్రీల) ఎదుట రావటం పాపం కాదు.[110] (మహిళా మణులారా!) అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ ప్రతిదానికీ సాక్షిగా ఉన్నాడు.[111]

لَا جُنَاحَ عَلَيْهِنَّ فِي آبَائِهِنَّ وَلَا أَبْنَائِهِنَّ وَلَا إِخْوَانِهِنَّ
وَلَا أَبْنَاءِ إِخْوَانِهِنَّ وَلَا أَبْنَاءِ أَخَوَاتِهِنَّ وَلَا نِسَائِهِنَّ وَلَا
مَا مَلَكَتْ أَيْمَانُهُنَّ ۗ وَاتَّقِينَ اللَّهَ ۚ إِنَّ اللَّهَ كَانَ عَلَىٰ كُلِّ
شَيْءٍ شَهِيدًا ﴿٥٥﴾

ప్రవక్త (స) సమాగమం జరిపిన తరువాత విడాకులు ఇచ్చేసిన మహిళలతో వివాహమాడవచ్చునా? అన్నది ఒక సందేహం. కాని ప్రవక్త(స) సమాగమం జరిపిన పిదప ఏ మహిళకూ అసలు విడాకులు ఇవ్వలేదు. కాబట్టి ఇలాంటి సందేహాలకు ఆస్కారమే లేదు. కాని ఒకవేళ ప్రవక్త (స) ఏ స్త్రీనయినా నికాహ్ చేసుకున్న తరువాత, ఆమెతో సమాగమం జరపకుండానే ఆమెకు విడాకులిచ్చేసి ఉంటే, ఆమెను ఇతర పురుషులెవరయినా వివాహమాడటం తప్పు అన్నట్లు ఎక్కడా రుజువు లేదు (తఫ్సీర్ ఇబ్నె కసీర్).

110. మహిళలపై పరదా ఆజ్ఞలు అవతరించినపుడు ఇండ్లల్లో పదే పదే తారసపడే రక్త సంబంధీకుల, ఆత్మీయుల విషయం ఏమిటీ? అన్న సందేహం ఉత్పన్నం అయింది. అందువల్ల ఈ ఆయతులో ఎవరెవరి ఎదుట రావటం అభ్యంతరకరం కాదో స్పష్ట పరచబడింది. ఈ వివరాలు మరింత స్పష్టంగా నూర్ సూరా 31వ వచనంలో ఇంతకు ముందే వచ్చాయి.

111. ఈ సందర్భంగా దైవభీతిని గురించి ప్రస్తావించటం గమనార్హం. పరదా ఆజ్ఞను అవతరింప జేసింది ఎందుకు? మనసులు నిర్మలంగా ఉండేందుకు, సౌశీల్యం, పారిశుద్ధ్యం వర్ధిల్లేందుకు! మనసులో దైవభక్తి, దైవభీతి గనక ఉంటే ఈ పరదా ఆజ్ఞ ద్వారా దేవుడు ఆశిస్తున్న ఈ పవిత్ర వాతావరణం తప్పకుండా ఏర్పడుతుంది. మనసులో దైవభీతి లేనంతవరకూ ఈ సామాజిక ఆంక్షల, కట్టుబాట్ల ద్వారా పరివర్తన రాదు.

**56** నిశ్చయంగా అల్లాహ్, ఆయన దూతలు కూడా దైవప్రవక్తపై కారుణ్యాన్ని పంపిస్తున్నారు. ఓ విశ్వాసులారా! మీరు కూడా అతనిపై దరూద్ పంపండి. అత్యధికంగా అతనికి 'సలాములు' పంపుతూ ఉండండి.[112]

إِنَّ اللَّهَ وَمَلَٰئِكَتَهُۥ يُصَلُّونَ عَلَى النَّبِيِّ ۚ يَٰٓأَيُّهَا الَّذِينَ ءَامَنُوا۟ صَلُّوا۟ عَلَيْهِ وَسَلِّمُوا۟ تَسْلِيمًا ﴿٥٦﴾

112. ఊర్ధ్వలోకాలలో అంతిమ దైవప్రవక్త (స)కు ఎంతటి గౌరవాదరణ ఉందో ఈ ఆయతు ద్వారా అవగతమవుతోంది. కారుణ్య ప్రభువు తన దూతల సమక్షంలో ఆయన (సఅసం)పై ప్రశంసల జల్లు కురిపిస్తున్నాడు. దైవదూతలు కూడా ఆయన (సఅసం) ఉన్నత సోపానాల కోసం ప్రార్థిస్తున్నారు. కాబట్టి భూవాసులు కూడా ఆయన (స) కోసం ప్రార్థిస్తూ ఉండాలనీ, ఆయనకు 'సలాం' సమర్పణ చేస్తూ ఉండాలని అల్లాహ్ ఆదేశిస్తున్నాడు. ఈ విధంగా ముహమ్మద్ (స)ను కొనియాడటంలో గగన వాసులతో పాటు, భూలోకవాసులు కూడా ఏకం కావాలన్నది దైవాభిమతం. హదీసులో ఇలా ఉంది : "దైవప్రవక్తా (స)! 'సలాం' పంపే పద్ధతి మాత్రం మాకు తెలిసిందే (అంటే అత్తహియ్యాత్ పఠించే సమయంలో 'అస్సలాము అలైక అయ్యుహన్నబియ్యు....' అని చదువుతాము). కాని మేము 'దురూద్' ఎలా పంపేది?" అని ప్రియసహచరులు (రజి) సందేహపడగా, ఆయన(స) నమాజులో పఠించే 'దురూదె ఇబ్రాహీం'ను నేర్పారు (సహీహ్ బుఖారీ – అల్ అహ్జాబ్ సూరా వ్యాఖ్యానం). ఇదిగాకుండా హదీసులలో దురూద్‌కు సంబంధించిన ఇతర పదాలు కూడా ఉన్నాయి. వాటిని కూడా పఠించ వచ్చు. క్లుప్తంగా **సల్లల్లాహు అలా రసూలిల్లాహి వ సల్లం** అని కూడా పఠించవచ్చు. కాని **అస్సలాతు వస్సలాము అలైక యా రసూలల్లాహ్!** అని చెప్పటం మాత్రం సరైనది కాదు. ఎందుకంటే ఈ పలుకు నేరుగా దైవప్రవక్త(స)తో సంభాషించటం లాంటిది. అత్తహియ్యాత్ సందర్భంగా **'అస్సలాము అలైక అయ్యు హన్నబియ్యు!'** అని పలకటం మాత్రం సమంజసమే. ఎందుకంటే ఈ మేరకు ప్రవక్త (స) వారే ప్రవచించి ఉన్నారు. కాని ఈ పలుకులను దైవప్రవక్త (స) వింటున్నారన్న మూఢ నమ్మకంతో ఎవరయినా పలికితే మాత్రం అలాంటి మూఢనమ్మకం ఖుర్ఆన్ హదీసు లకు విరుద్ధమైనది. అలాంటి మూఢనమ్మకంతో నిర్ణీత దురూద్ పఠించటం కూడా సరైనది కాదు. అలాగే 'అజాన్ పిలుపు' ఇవ్వడానికి ముందు దాన్ని పఠించటం కూడా బిద్అత్‌గా పరిగణించబడుతుంది. దానివల్ల పుణ్యం ఎలాగూ ప్రాప్తించదు సరికదా అది పాపకరంగా పరిణమిస్తుంది.

హదీసులలో 'దురూద్' మహత్త్యం గురించి నొక్కి వక్కాణించబడింది. నమాజులో దురూద్ పఠించటం అనివార్యమా (వాజిబా)? లేక సంప్రదాయమా (సున్నతా)?

57 అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను బాధించే వారిపై ప్రపంచంలోనూ, పరలోకంలోనూ అల్లాహ్ శాపం

إِنَّ الَّذِينَ يُؤْذُونَ اللَّهَ وَرَسُولَهُ لَعَنَهُمُ اللَّهُ فِي الدُّنْيَا

మెజారిటీ విద్వాంసులు దీన్ని సంప్రదాయంగా భావిస్తున్నారు. ఇమామ్ షాఫయితో పాటు మరికొంతమంది విద్వాంసులు మాత్రం దీనిని తప్పనిసరి (వాజిబ్)గా తలపోస్తున్నారు. హదీసుల ఆధారంగా చూస్తే అది వాజిబ్ (తప్పనిసరి) అని భావించ టానికి ఎక్కువ ఆస్కారం ఉంది. చివరి తషహ్హుద్‌లో దురూద్ పఠించటం ఏ విధంగా తప్పనిసరియో మొదటి తషహ్హుద్‌లో దురూద్ పఠించటం కూడా అటువంటిదేనని కూడా హదీసుల ద్వారా అవగతమవుతోంది. అందువల్ల నమాజులోని రెండు తషహ్హుద్‌లలోనూ దురూద్ పఠించటం అనివార్యం.

దీని ఆధారాలు సంక్షిప్తంగా ఇలా ఉన్నాయి-1.ముస్నదె అహ్మద్‌లోని ఒక ప్రామాణిక ఉల్లేఖనం ప్రకారం ఒక వ్యక్తి దైవప్రవక్త (స)తో ఇలా విన్నవించుకున్నాడు : "ఓ దైవప్రవక్తా (సఅసం)! మీ పేరున సలాం ఎలా చదవాలో మాకు తెలుసు (మేము తషహ్హుద్‌లో అస్సలాము అలైక అని చదువుతూ ఉంటాము). కాని మేము నమాజులో వున్నప్పుడు మీపై దురూద్‌ను ఎలా పంపాలి?" అప్పుడు దైవప్రవక్త (స) దురూద్ పద్ధతిని నేర్పారు (అల్ ఫతహుర్రబ్బానీ-సంపుటి:4, పేజీ-20, 21). ముస్నదె అహ్మద్‌తో పాటు ఈ ఉల్లేఖనం సహీహ్ ఇబ్నె హిబ్బాన్, సుననె కుబ్రా బైహఖీ, ముస్తద్రక్ హాకిమ్, ఇబ్నె ఖుజైమాలలో కూడా ఉంది. ఏ విధంగా నమాజులో (అంటే తషహ్హుద్‌లో) 'సలాం' పఠించబడుతుందో అదేవిధంగా నమాజులో దురూద్ కూడా పఠించబడుతుందా? అన్న ప్రశ్నకు అందులో వివరంగా సమాధానం ఇవ్వబడింది. 'దురూదె ఇబ్రాహీమ్'ని పఠించమని దైవప్రవక్త (సఅసం) ఆదేశించారు. దీన్నిబట్టి విదితమయ్యేదేమిటంటే నమాజులో 'సలాం'తో పాటు 'దురూద్' కూడా పఠించాలి. అది తషహ్హుద్ (ఖాయిదా) సందర్భంగా పఠించాలి. హదీసులో ఇది సర్వసాధారణమైన ఆజ్ఞగా ఉంది. అది మొదటి తషహ్హుద్ కొరకుగానీ, చివరి తషహ్హుద్ కొరకు గానీ ప్రత్యేకించబడలేదు. అందుచేత రెండు తషహ్హుద్ (మొదటిది, రెండవది)లలో కూడా సలామ్‌తో పాటు దురూద్ పఠించాలని చెప్పటానికి తగు ఆధారం లభ్యమవుతోంది. ఏ ఉల్లేఖనాలలోనయితే మొదటి తషహ్హుద్ దురూద్ లేకుండానే ప్రస్తావించబడిందో అది అహ్జాబ్ సూరాలోని **"సల్లూ అలైహి వ సల్లిమూ తస్లీమా"** ఆయతు అవతరణకు పూర్వం ఉండేదని భావించాలి. కాని ఈ ఆయతు అవతరణ తర్వాత - అంటే హిజ్రీ 5వ సంవత్సరం తరువాత-ప్రియసహచరుల అభ్యర్థనపై దైవప్రవక్త (స) దురూద్ వాక్యాలు కూడా వివరించారు. అందుచేత ఇప్పుడు నమాజులో - అది మొదటి తషహ్హుద్ అయినా లేక రెండవ తషహ్హుద్ అయినా-సలామ్‌తో పాటు దురూదె

| | |
|---|---|
| పడుతుంది. ఇంకా వారి కోసం అత్యంత అవమానకరమైన శిక్ష సిద్ధంగా ఉంది.[113] | وَالْآخِرَةِ وَأَعَدَّ لَهُمْ عَذَابًا مُّهِينًا ۝ |

షరీఫ్ కూడా పఠించటం తప్పనిసరి అయిపోయింది.

2. రెండవ ఆధారం : హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం ప్రకారం దైవప్రవక్త (స) కొన్ని కొన్ని సార్లు రాత్రిపూట తొమ్మిది రకాతుల నమాజు చేసేవారు. అప్పుడు ఎనిమిదవ రకాతు అనంతరం తషహ్హుద్ (ఖాయిదా)లో కూర్చుని తన ప్రభువును వేడుకునేవారు, దైవప్రవక్త (స)పై 'దురూద్' పంపేవారు. పిమ్మట నమాజు ముగించకుండానే లేచి నిలుచునేవారు. తొమ్మిదవ రకాతు పూర్తిచేసిన తరువాత తషహ్హుద్‌లో కూర్చుని తన ప్రభువును వేడుకునేవారు. దైవప్రవక్తపై దురూద్ చదివేవారు, ఆ తరువాత మళ్లీ దుఆ చేసేవారు. ఆ తరువాత నమాజును ముగించేవారు (అల్ సుననుల్ కుబ్రా, లిల్ బైహఖీ – సంపుటి:2, పేజీ–704; సుననె నసాయి (నూతన ప్రచురణ), మఅత్తాలీఖాతుస్ సలఫియ, కితాబ్ ఖియాముల్లైల్ – సంపుటి: 1, పేజీ – 202). మరిన్ని వివరాల కోసం చూడండి : సిఫతు సలాతిన్నబీ(సఅసం) లిల్ అల్‌బానీ– పేజీ–145. దైవప్రవక్త(స) తన రాత్రిపూట నమాజులో మొదటి మరియు చివరి తషహ్హుద్‌లు రెండింటిలోనూ, దురూద్ వాక్యాలు పఠించినట్లు స్పష్టంగా ఉంది. ఇది నఫిల్ (స్వచ్ఛంద) నమాజు సంగతే అయినప్పటికీ పైన ప్రస్తావించబడిన ఆధారాలకు ఆయన (స) గారి ఈ 'ఆచరణ' ద్వారా సమర్థన లభిస్తోంది. అందువల్ల దీనిని కేవలం స్వచ్ఛంద (నఫిల్) నమాజులకే పరిమితం చేయటం భావ్యం కాదు.

113. అల్లాహ్‌ను బాధించటం అంటే అల్లాహ్‌కు అయిష్టకరమైన చేష్టలకు ఒడిగట్టడమని అర్థం. వాస్తవానికి ప్రత్యక్షంగా అల్లాహ్‌ను బాధించే శక్తి ఎవరికీ లేదు. కాకపోతే దాసులలో కొందరు అల్లాహ్‌కు ఆపాదించే అబద్ధాలు, వారు పాల్పడే చేష్టలు అత్యంత అయిష్టకరంగా ఉంటాయి. ఉదాహరణకు : ముష్రిక్కులు, యూదులు, క్రైస్తవులు మొదలగువారు అల్లాహ్‌కు సంతానం ఉందని వాదిస్తున్నారు. ఇది అల్లాహ్‌కు అత్యంత అయిష్టకరమైన విషయం. అలాగే ఒక హదీసె ఖుద్‌సీ ద్వారా కూడా ఈ విషయం అవగతమవుతోంది – "ఆదం పుత్రుడు నాకు బాధ కలిగిస్తున్నాడు. అతను కాలాన్ని తిట్టిపోస్తున్నాడు. వాస్తవానికి కాలాన్ని నేనే. దాని రేయింబవళ్ళ భ్రమణం నా ఆదేశానుసారమే జరుగుతోంది" అని అల్లాహ్ సెలవిస్తున్నాడు. (సహీహ్ బుఖారీ– సూరతుల్ జాసియా వ్యాఖ్యానం; ముస్లిం – కితాబుల్ అల్‌ఫాజ్ మినల్ అదబ్). అంటే కాలచక్రం లేదా ఖగోళ గమనంలోని తేడాపాడాల మూలంగా తనకీ గతి పట్టిందని అనటం సరికాదు. ఎందుకంటే జరిగిన ఘటనలు అల్లాహ్‌వేగాని కాలానివి కావు.

దైవప్రవక్త (స)కు బాధ కలిగించటమంటే ఆయన్ని త్రోసిపుచ్చటం, కవిపుంగవుడని

**58** తప్పు చేయని విశ్వాసులైన పురుషులను, విశ్వాసులైన స్త్రీలను వేధించేవారు (చాలా పెద్ద) అభాండాన్ని, స్పష్టమైన పాపభారాన్ని మోసిన వారవుతారు.[114]

وَالَّذِيْنَ يُؤْذُوْنَ الْمُؤْمِنِيْنَ وَالْمُؤْمِنٰتِ بِغَيْرِ مَا اكْتَسَبُوْا فَقَدِ احْتَمَلُوْا بُهْتَانًا وَّاِثْمًا مُّبِيْنًا ﴿٥٨﴾

**59** ఓ ప్రవక్తా! తమపై నుంచి తమ దుప్పట్లను (క్రిందికి) వ్రేలాడేలా కప్పుకోమని[115] నీ భార్యలకు, నీ కుమార్తెలకు, విశ్వాసులైన

يٰٓاَيُّهَا النَّبِيُّ قُلْ لِّاَزْوَاجِكَ وَبَنٰتِكَ وَنِسَآءِ الْمُؤْمِنِيْنَ يُدْنِيْنَ عَلَيْهِنَّ مِنْ جَلَابِيْبِهِنَّ ذٰلِكَ اَدْنٰٓى اَنْ يُّعْرَفْنَ

ఆయన్ని నిందించటం, ఆయన అసత్యవాది అని అభాండం మోపటం, మాంత్రికుడని ఆరోపించటం అన్నమాట! అంతేకాదు, ప్రవక్త ప్రియ సహచరులను దూషించటం, వారిపట్ల అమర్యాదకరంగా మాట్లాడటం కూడా ఈ బాధలోకి వస్తుందని ఆయన (స) చెప్పినట్లు కొన్ని హదీసుల ద్వారా రూఢీ అవుతోంది. అల్లాహ్ శాపం పడటం అంటే దైవకారుణ్యానికి నోచుకోకుండా పోవటం అని భావం.

114. అంటే వారిని పరాభవం పాలుచేసే ఉద్దేశంతో వారిపై నీలాపనిందలు మోపటం, అన్యాయంగా వారిపై వేలెత్తటం అని భావం. ఉదాహరణకు రవాఫిజీలు (ఇది ఒక వర్గం) ప్రవక్త ప్రియ సహచరులను రేయింబవళ్ళు తూలనాడుతూ ఉండేవారు. వారు చేయని పనులను వారికి అంటగట్టేవారు. ఈ పూర్వరంగంలో ఇమామ్ ఇబ్నె కసీర్ ఇలా అంటున్నారు: "రవాఫిజీలు వక్ర మనస్కులు. వారు ప్రశంసనీయులైన వ్యక్తులను నిందిస్తారు. నిందార్హులను ప్రశంసిస్తారు."

115. **'జలాబీబ్'** (جَلَابِيْب) అంటే శరీరాన్నంతటినీ కప్పివేసే పెద్ద దుప్పటి లేక పెద్ద వస్త్రం అని అర్థం. తమపైన తమ దుప్పట్లను వ్రేలాడదీయటమంటే తలభాగం నుంచి ముఖంపై– ముఖంలో అధికాంశభాగం కప్పబడే విధంగా – వస్త్రాన్ని వేయటం అన్నమాట. నేడు భారత దేశంలోగానీ, ఇతర దేశాలలో గాని ముస్లిం స్త్రీలు ధరించే బురఖాలు పలు పలు రకాలుగా ఉంటున్నాయి. దైవప్రవక్త (సఅసం) కాలంలో ఇలాంటి బురఖాలు ఉండేవికావు. ఆనాటి బురఖాలు చాలా సాదాసీదాగా, నిరాడంబరంగా ఉండేవి. వారు ధరించే దుస్తులు కూడా మరీ నిరాడంబరంగా ఉండేవి. వాటి ద్వారా స్త్రీలు తమ అందచందాలనుగానీ, అలంకరణనుగానీ ప్రదర్శించే ఉద్దేశం ఏ కోశానా కనబడేది కాదు. అందువల్ల వారు కప్పుకునే ఒక్క పెద్ద దుప్పటి ద్వారా కూడా 'పరదా' ఉద్దేశం నెరవేరేది. కాని రానురాను ఈ నిరాడంబరత మిగిలి ఉండలేదు. వారు ధరించే బురఖా కూడా ఆడంబరానికి ప్రతీకగా మారసాగింది. తాము ధరించే దుస్తుల ద్వారా, ఆభరణాల ద్వారా తమ అంతస్థును, అందచందాలను

| | |
|---|---|
| స్త్రీలకు చెప్పు. తద్వారా వారు చాలా తొందరగా (మర్యాదస్తులుగా) గుర్తించ బడి, వేధింపుకు గురికాకుండా ఉంటారు.[116] అల్లాహ్ క్షమించేవాడు, కనికరించేవాడు. | فَلَا يُؤْذَيْنَ وَكَانَ اللّٰهُ غَفُوْرًا رَّحِيْمًا ﴿٥٩﴾ |

వ్యక్తపరచాలన్న మోజు మహిళల్లో పెరిగిపోయింది. ఈ కారణంగా నిరాడంబరతకు చిహ్నంగా ఉన్న పెద్ద దుప్పటి కనుమరుగైపోయి, దాని స్థానంలో రంగురంగుల బురఖాలు, డిజైన్ల బురఖాలు మార్కెట్టులో చోటుచేసుకున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరయినా పాత సంప్రదాయం ప్రకారం దుప్పటి కప్పుకుంటే జనం దాన్నొక వింతగా భావించేటట్టున్నారు. కాని పరదా పాటించే ఉద్దేశంతో ఇలాంటి దుప్పటిని వేసుకుని, ముఖంపై కూడా వస్త్రాన్ని కప్పి ఉంచే స్త్రీ ఖచ్చితంగా పరదా ఆజ్ఞను పాటించినట్లే. ఎందుకంటే నేడు మహిళలు ధరించే 'బురఖా' పరదా కోసం షరీయతు నిర్ధారించిన ప్రత్యేక వస్తువు కాదు. శరీరాన్ని, ముఖాన్ని కప్పి ఉంచే ప్రతిదీ పరదా పాటింపులో అంతర్భాగమే.

అయితే నేటి మహిళలు కొందరు ఈ 'దుప్పటి'ని కూడా ఓ ఫ్యాషన్‌గా తీసుకుంటున్నారు. పరదా ఆచారం నుంచి బయటపడే ఉద్దేశంతో వారు మొదట్లో ఓ చిన్న దుప్పటిని తలపైనో, భుజాలపైనో వేసుకుంటారు. ఆ దుప్పటి సైతం శరీరాచ్ఛాదనకు ఉద్దేశించినదిగా కాకుండా అలంకారానికి, ఆడంబరానికి చిహ్నంగా ఉంటుంది. క్రమక్రమంగా ఆ చిన్న దుప్పటి కూడా మటుమాయమై, తలపై ఓ చిన్న స్కార్ఫ్ ఉండిపోతుంది. పరిస్థితుల ఈ స్వరూపాన్ని చూస్తూ ఉంటే, వీటన్నింటికన్నా బురఖాయే నయం అనిపిస్తోంది. ఎందుకంటే బురఖాలకు ప్రత్యామ్నాయంగా దుప్పట్లను వేసుకోవటం మొదలెట్టిన మహిళామణులు రాను రాను కొత్తపుంతలు తొక్కి పరదా ఉద్దేశ్యాన్నే ధ్వంసం చేస్తున్నారు.

మొత్తమ్మీద ఈ ఆయతులో ఇంటి గడపదాటి బయటకు వచ్చినప్పుడు పరదా ఆజ్ఞలను ఖచ్చితంగా పాటించవలసిందిగా దైవప్రవక్త (స) సతీమణులకు, కుమార్తెలకు, సాధారణ ముస్లిం మహిళలకు ఆదేశించబడింది. దీన్నిబట్టి స్పష్టంగా బోధపడేదేమిటంటే నేడు కొంతమంది ఎద్దేవా చేస్తున్నట్లు పరదా ఆజ్ఞ పండితులు సృష్టించినది కాదు. ఇది ముమ్మాటికీ దైవాజ్ఞ అని ఖుర్‌ఆన్ ద్వారా రూఢీ అవుతోంది. దీనిపట్ల విముఖతను చూపటం, దీన్ని ఉల్లంఘించి విచ్చలవిడితనాన్ని ప్రోత్సహించటం 'కుఫ్ర్' (దైవతిరస్కారం) క్రిందికి వస్తుంది.

116. **'పరదా'** వల్ల మహిళలకు చేకూరే ప్రయోజనం ఏమిటో ఇక్కడ చెప్పటం జరిగింది.

**60** ఈ కపటులు, హృదయాలలో రోగ మున్నవారు, మదీనాలో తప్పుడు వదంతులను వ్యాపింపజేస్తున్నవారు[117] (ఇప్పటికైనా తమ దుష్టవైఖరిని) మానుకోకపోతే, (వారికి వ్యతిరేకంగా చర్య తీసుకోవటానికి) మేము నిన్ను వారిపై నియమిస్తాము. ఆ తరువాత వారు కొన్నాళ్ళు మాత్రమే నీతోపాటు ఇక్కడ (ఈ నగరంలో) ఉండగలుగుతారు.

لَئِن لَّمْ يَنتَهِ الْمُنَافِقُونَ وَالَّذِينَ فِي قُلُوبِهِم مَّرَضٌ وَالْمُرْجِفُونَ فِي الْمَدِينَةِ لَنُغْرِيَنَّكَ بِهِمْ ثُمَّ لَا يُجَاوِرُونَكَ فِيهَا إِلَّا قَلِيلًا ﴿٦٠﴾

**61** వారు శాపగ్రస్తులయ్యారు – ఎక్కడ దొరికితే అక్కడే పట్టుకోబడతారు. దారుణంగా చంపబడతారు.[118]

مَّلْعُونِينَ ۖ أَيْنَمَا ثُقِفُوا أُخِذُوا وَقُتِّلُوا تَقْتِيلًا ﴿٦١﴾

**62** వీరి పూర్వీకుల విషయంలో కూడా అల్లాహ్ యొక్క ఈ సంప్రదాయమే ఉండేది. అల్లాహ్ సంప్రదాయంలో నువ్వు ఎలాంటి మార్పునూ కానలేవు.

سُنَّةَ اللَّهِ فِي الَّذِينَ خَلَوْا مِن قَبْلُ ۖ وَلَن تَجِدَ لِسُنَّةِ اللَّهِ تَبْدِيلًا ﴿٦٢﴾

---

పరదాను పాటించే మహిళ మర్యాదస్తుల కుటుంబానికి చెందిన మహిళ అనీ, లజ్జ, బిడియం ఆమె ఆస్తి అనీ, ఆమె ధార్మికురాలని జనులు గ్రహిస్తారు. ఆమెను వేధించరు సరికదా, ఆమెను గౌరవిస్తారు. అదే సమయంలో సిగ్గువిడిచి, బరితెగించి బజారుల్లో తిరిగే స్త్రీని జనులు గౌరవించరు సరికదా, ఆమెను వేధించటం మొదలెడతారు.

117. ముస్లింల ఆత్మ విశ్వాసాన్ని నీరు గార్చడానికి, వారి శిబిరాలలో కలవరాన్ని రేకెత్తించటానికి ఆనాడు కపటులు రకరకాల పుకార్లను పుట్టించేవారు. ఉదాహరణకు: ఫలానా ప్రదేశంలో ముస్లింలు ఘోర పరాజయం పొందారనో, ఫలానా ప్రాంతానికి చెందిన శత్రుసేనలు దండెత్తి రావటానికి సిద్ధంగా ఉన్నాయనో ప్రకటించి అలజడిని సృష్టించేవారు.

118. వారు ఎక్కడ కనిపిస్తే అక్కడే పట్టుకొని చంపేయండి అని అనబడలేదు. వాస్తవానికి ఇదొక అభిశాపం. వారు తమ కపట చేష్టలను మానుకోకపోతే దాని పర్యవసానం అత్యంత దారుణంగా ఉంటుందని హెచ్చరించబడింది. ఇది 'ఆజ్ఞ' అని కొందరు అభిప్రాయపడ్డారు. కాని ఈ ఆయతు అవతరించిన తరువాత ఈ కపటులు తమ కపట చేష్టలను మానుకున్నారు. అందువల్ల ఈ ఆయతులో పేర్కొనబడిన కఠినచర్యలు వారిపై గైకొనబడలేదు (ఫత్‌హుల్ ఖదీర్).

**63** ప్రళయ ఘడియ గురించి జనులు నిన్ను ప్రశ్నిస్తున్నారు కదూ! ‘ఆ సంగతి అల్లాహ్‌కే తెలుసు’ అని వారికి చెప్పు. నీకేం తెలుసు? బహుశా ప్రళయం అతి సమీపంలోనే ఉందేమో!

يَسْـَٔلُكَ النَّاسُ عَنِ السَّاعَةِ ۭ قُلْ اِنَّمَا عِلْمُهَا عِنْدَ اللّٰهِ ۭ وَمَا
يُدْرِيْكَ لَعَلَّ السَّاعَةَ تَكُوْنُ قَرِيْبًا ۝٦٣

**64** అల్లాహ్ అవిశ్వాసులను శపించాడు. ఇంకా వారి కోసం మండే అగ్నిని సిద్ధం చేసి ఉంచాడు.

اِنَّ اللّٰهَ لَعَنَ الْكٰفِرِيْنَ وَاَعَدَّ لَهُمْ سَعِيْرًا ۝٦٤

**65** అందులో వారు ఎల్లకాలం పడి ఉంటారు. వారు ఏ సంరక్షకుణ్ణీ, సహాయకుణ్ణీ పొందలేరు.

خٰلِدِيْنَ فِيْهَآ اَبَدًا ۚ لَا يَجِدُوْنَ وَلِيًّا وَّلَا نَصِيْرًا ۝٦٥

**66** ఆ రోజు వారి ముఖాలు అగ్నిలో అటూ ఇటూ పొర్లింపబడతాయి. అప్పుడు వారు, “అయ్యో! మేము అల్లాహ్‌కు, ప్రవక్తకు విధేయత చూపి ఉంటే ఎంత బావుండేది?” అని అంటారు.

يَوْمَ تُقَلَّبُ وُجُوْهُهُمْ فِي النَّارِ يَقُوْلُوْنَ يٰلَيْتَنَآ اَطَعْنَا اللّٰهَ
وَاَطَعْنَا الرَّسُوْلَا ۝٦٦

**67** ఇంకా ఇలా అంటారు : “ప్రభూ! మేము మా సర్దారులు, పెద్దలు చెప్పినట్లు విన్నాము. వారు మమ్మల్ని పెడత్రోవ పట్టించారు.[119]

وَقَالُوْا رَبَّنَآ اِنَّآ اَطَعْنَا سَادَتَنَا وَكُبَرَاۗءَنَا فَاَضَلُّوْنَا السَّبِيْلَا ۝٦٧

119. అంటే, మేము నీ ప్రవక్తల, ధర్మ సందేశ ప్రదాతల మాట వినకుండా మా కులపెద్దల అడుగుజాడల్లో నడిచాము. కాని వీళ్లు మమ్మల్ని ప్రవక్తల మార్గానికి దూరంగా ఉంచారనీ, సన్మార్గం నుంచి మమ్మల్ని తప్పించారని ఇప్పుడు మాకు అర్థమయింది అని ఒప్పుకుంటారు.
సత్యాన్ని కాదని పూర్వీకుల, కులపెద్దల అడుగులకు మడుగులొత్తే పోకడ నేటికీ జనులను అపమార్గానికి లోనుచేస్తూనే ఉంది. ముస్లింలు ఈ దైవవచనాన్ని లోతుగా అధ్యయనం చేసి ఈ అపవాదాల నుంచి బయటపడితే, ఖుర్ఆన్ హదీసుల (రుజు) మార్గాన్ని అవలంబిస్తే ఎంత బావుంటుంది! ఎందుకంటే మోక్షం అన్నది దైవం మరియు దైవప్రవక్త మార్గానుసరణలోనే ఉందిగాని తాతముత్తాతల, కులపెద్దల కాల్పనిక పద్ధతుల్లో లేదు.

68 "ప్రభూ! నీవు వారికి రెండింతల శిక్షను విధించు. వారిపై పెద్ద శాపాన్ని అవతరింపజెయ్యి."

رَبَّنَآ ءَاتِهِمْ ضِعْفَيْنِ مِنَ ٱلْعَذَابِ وَٱلْعَنْهُمْ لَعْنًا كَبِيرًا ٦٨

69 విశ్వసించిన ఓ ప్రజలారా! మీరు మూసాను కష్టపెట్టిన వారి మాదిరిగా తయారవకండి. మరి వారు అన్న మాట నుంచి అల్లాహ్ అతన్ని – మచ్చలేని వానిగా – నిగ్గుతేల్చాడు.[120] అతను అల్లాహ్ దృష్టిలో ఎంతో ఆదరణీయుడుగా ఉండేవాడు.

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوا۟ لَا تَكُونُوا۟ كَٱلَّذِينَ ءَاذَوْا۟ مُوسَىٰ فَبَرَّأَهُ ٱللَّهُ مِمَّا قَالُوا۟ ۚ وَكَانَ عِندَ ٱللَّهِ وَجِيهًا ٦٩

120. దీని పూర్వరంగం హదీసులో ఈ విధంగా ఉంది : దైవప్రవక్త హజ్రత్ మూసా (అలైహిస్సలాం) ఎంతో బిడియం కలవారు. ఆయన ఎన్నడూ ప్రజల ముందు నగ్నంగాగానీ, అర్ధనగ్నంగా గానీ ఉండలేదు. అందువల్ల – బహుశా ఆయన ఒంటిపై బొల్లిగానీ, మరేదైనా వ్యాధి మచ్చలుగానీ ఉండి ఉంటాయని, అందుకే పొద్దస్తమానం ఆయన తన ఒంటిని కప్పుకుని ఉంటున్నారని ఇస్రాయీలీయులు గుసగుసలాడు కునేవారు.

మూసా అనుయాయుల ఈ మీమాంసను అల్లాహ్ పటాపంచలు చేయదలిచాడు. ఒకసారి హజ్రత్ మూసా (అలైహిస్సలాం) ఒంటరిగా ఉన్నప్పుడు చెరువులో స్నానం చేయదలచి, బట్టలు విడిచి రాతిబండపై పెట్టారు. అప్పుడు (దైవాజ్ఞానుసారం) ఆ రాతిబండ దుస్తుల సమేతంగా ఎగిరిపోసాగింది. మూసా (అలైహిస్సలాం) ఆ రాతిబండను వెంబడించారు. అలా ఆ రాతిబండను వెంబడిస్తూ ఇస్రాయీలీయులు ఆసీనులై ఉన్న ఒక సమావేశస్థలికి చేరుకున్నారు. ఆ సందర్భంలో వారంతా మూసాను నగ్న స్థితిలో చూశారు. మూసా (అలైహి) వారికి ఎంతో అందమైన శరీరఛాయ కలవానిగా, మచ్చలేని వ్యక్తిగా కనిపించారు. ఈ విధంగా అల్లాహ్ ఒక రాతిబండద్వారా – అద్భుతంగా – ప్రజలు మూసాకు ఆపాదించిన కళంకాన్ని తుడిచిపెట్టాడు (సహీహ్ బుఖారీ – కితాబుల్ అంబియా).

హజ్రత్ మూసా (అలైహిస్సలాం) దృష్టాంతం ద్వారా ఈ ఆయతులో ముహమ్మద్ (సఅసం) అనుచరులకు చేయబడిన తాకీదు ఏమిటంటే; మీరు కూడా ఇస్రాయీలీ యులలాగా మీ ప్రవక్త (సఅసం)కు మనస్తాపం కలిగించకండి. ఆయన్ని(స) వ్యాకుల తకు లోనుచేసే మాటలు చెప్పకండి. ఉదాహరణకు : ఒకానొక సందర్భంలో విజయ

**70** ఓ విశ్వాసులారా! అల్లాహ్‌కు భయ పడండి. మాట్లాడితే సూటిగా మాట్లాడండి[121] (సత్యమే పలకండి).

يَاأَيُّهَا الَّذِينَ آمَنُوا اتَّقُوا اللَّهَ وَقُولُوا قَوْلًا سَدِيدًا ۝٧٠

**71** తద్వారా అల్లాహ్ మీ ఆచరణలను చక్కదిద్దుతాడు. మీ పాపాలను మన్నిస్తాడు.[122] ఎవరయితే అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు విధేయత కనబరచాడో అతను గొప్ప విజయం సాధించాడు.

يُصْلِحْ لَكُمْ أَعْمَالَكُمْ وَيَغْفِرْ لَكُمْ ذُنُوبَكُمْ وَمَنْ يُطِعِ اللَّهَ وَرَسُولَهُ فَقَدْ فَازَ فَوْزًا عَظِيمًا ۝٧١

**72** మేము మా అప్పగింత(అమానతు)ను ఆకాశాల ముందూ, భూమి ముందూ, పర్వతాల ముందూ ఉంచాము. కాని అవన్నీ దాన్ని మోయటానికి నిరాకరించాయి. దానికి భయపడిపోయాయి. (అయితే) మానవుడు మాత్రం దాన్ని ఎత్తు

إِنَّا عَرَضْنَا الْأَمَانَةَ عَلَى السَّمَاوَاتِ وَالْأَرْضِ وَالْجِبَالِ فَأَبَيْنَ أَنْ يَحْمِلْنَهَا وَأَشْفَقْنَ مِنْهَا وَحَمَلَهَا الْإِنْسَانُ إِنَّهُ كَانَ ظَلُومًا جَهُولًا ۝٧٢

ధనం (మాలె గనీమత్) పంపిణీ చేస్తుండగా ఒక వ్యక్తి, "నాయసమ్మతంగా పంపకం జరగలేద"ని ఆరోపించాడు. ఫలానా వ్యక్తి ఈ విధంగా అంటున్నాడని దైవప్రవక్త (స)కు తెలిసినప్పుడు ఆయన ముఖారవిందం ఆగ్రహంతో కందిపోయింది. అప్పుడాయన (స) "మూసా (అలైహిస్సలాం)పై దేవుడు కరుణించుగాక! ఆయన ఇంతకన్నా ఎక్కువే బాధించబడ్డారు. అయినప్పటికీ ఆయన ఓర్పు వహించారు" అని పలికారు (బుఖారీ – కితాబుల్ అంబియా; ముస్లిం – కితాబుజ్జకాత్....)

121. సూటిగా, సరిగ్గా మాట్లాడటమంటే అర్థం మాటలో తిరకాసు ఉండకుండా జాగ్రత్త పడటం. మాటలో ద్వంద్వార్థాలకు తావుండకూడదు. మాటలో మోసం ఉండకూడదు. ఎంతో ఖచ్చితంగా, స్పష్టంగా, నిర్దిష్టంగా మాట్లాడాలి. ఏది చెప్పినా అది సత్యంతో కూడినదై ఉండాలి. **'సదీద్'** (سَدِيد) అంటే సూటిగా, తిన్నగా, బాణంలా వెలువడేది అని అర్థం. మీ నోట వెలువడే మాట మీ మంచినడవడికకు, రుజువర్తనకు, నీతీ నిజాయితీలకు ప్రతిబింబంగా ఉండాలి.

122. మీరు భయభక్తుల వైఖరిని అవలంబించి, నిజాయితీగా మాట్లాడిన దాని ఫలితంగా మీ పనులు చక్కబడతాయి. అల్లాహ్ మిమ్మల్ని అపారంగా అనుగ్రహిస్తాడు. మీ వల్ల జరిగే చిన్న చిన్న పొరపాట్లను మన్నిస్తాడు.

కున్నాడు.[123] అవును, వాడు అక్రమానికి ఒడిగట్టేవాడు, మూర్ఖుడు.[124]

لِّيُعَذِّبَ اللّٰهُ الْمُنٰفِقِيْنَ وَالْمُنٰفِقٰتِ وَالْمُشْرِكِيْنَ

**73** అల్లాహ్ కపటులైన పురుషులను, కపటులైన స్త్రీలను, ముష్రిక్కులైన పురుష

123. విధేయత చూపిన వారికి ఇచ్చే బహుమానాన్ని, అవిధేయులైన వారికి విధించే శిక్షను గురించి వివరించిన తరువాత అల్లాహ్ ఇప్పుడు తన షరీయతు ఆదేశాలను గురించి ప్రస్తావిస్తున్నాడు. ఇక్కడ **'అమానతు'** అంటే షరీయతు ఆదేశాలు, విధ్యుక్తధర్మాలు అని భావం. వాటిని పాటించిన వారికి పుణ్యఫలం లభిస్తుంది. త్రోసిపుచ్చిన వారు శిక్షార్హులవుతారు. ఈ సాధకబాధకాలతో కూడుకున్న అమానతును (బాధ్యతతో కూడుకున్న అప్పగింతను) భూమ్యాకాశాల ముందు, పర్వతాల ముందు పెట్టినప్పుడు అవి భయంతో వణికిపోయాయి. దాన్ని మోయటానికి ఏ ఒక్కటీ సంసిద్ధతను వ్యక్తపరచలేదు. కాని దానిని మానవుని ఎదుట ఉంచినపుడు అతడు, దైవాజ్ఞను శిరసావహించినందులకు ప్రాప్తించే పుణ్యఫలానికి ఆశపడి ఆ కీలక బరువును మోయటానికి ఒప్పేసుకున్నాడు. ఈ ఆయతులో షరీయతు ఆదేశాలను 'అమానతు'గా అభివర్ణించటం గమనించదగ్గ విషయం. తమవద్దనున్న ఒక అమానతు (అప్పగింత)ను కోరినప్పుడు ఇవ్వటం ఎంత అవసరమో షరీయతు ఆదేశాలను నిర్వర్తించటం కూడా అంతే అవసరం.

అమానతును భూమ్యాకాశాల, పర్వతాల ఎదుట ఉంచటం అంటే ఏమిటి? దానికి అవి ఏ రీతిలో స్పందించాయి? మానవుడు ఈ అప్పగింత భారాన్ని ఏ సమయంలో, ఎలా ఎత్తుకున్నాడు? అన్నది అనిర్వచనీయం. ఆ స్థితిని మనం వివరించలేము. అయితే అల్లాహ్ ప్రతి సృష్టిరాశిలోనూ ఒక విధమైన చైతన్యాన్ని, స్పందనను పొందుపరచాడన్నది మాత్రం వాస్తవం. దీన్ని మనమంతా నమ్మాలి. అందలి వాస్తవికత మనకు బోధపడకపోవచ్చు. కాని అల్లాహ్‌కు ప్రతిదీ తెలుస్తుంది. ఆయన తప్పకుండా ఆ అమానతును వాటి ముందు పెట్టి ఉంటాడు. అవన్నీ దాన్ని మోయటానికి వెనుకాడి ఉంటాయి. తిరుగుబాటు చేసే ఉద్దేశంతోనో, అహంకారంతోనో అవి ఆ బాధ్యతకు వెరవలేదు. భయం మూలంగానే అవి నిరాకరించాయి. ఒకసారి బాధ్యతను స్వీకరించిన తరువాత దాన్ని సజావుగా నిర్వర్తించకపోతే లేనిపోని కష్టాలు ఎక్కడ వచ్చిపడతాయోనని అవి వెనుకంజ వేశాయి. కాని మానవుడు తొందరపడేవాడు. అతను ఆ సందర్భంలో కీడెంచి వెనక్కి తగ్గేబదులు మేలును పొందే తాపత్రయంలో బాధ్యతను నెత్తిమీద వేసుకున్నాడు.

| | |
|---|---|
| ‌లను, ముష్రిక్కులైన స్త్రీలను శిక్షించటానికి, విశ్వాసులైన పురుషుల, విశ్వాసులైన స్త్రీల పశ్చాత్తాపాన్ని స్వీకరించటానికి[125] (ఇదంతా జరిగింది). అల్లాహ్ అపారంగా క్షమించేవాడు, అమితంగా కరుణించే వాడు. | وَالْمُشْرِكٰتِ وَيَتُوْبَ اللّٰهُ عَلَى الْمُؤْمِنِيْنَ وَالْمُؤْمِنٰتِ وَكَانَ اللّٰهُ غَفُوْرًا رَّحِيْمًا ﴿٧٣﴾ |

124. అంటే అతను ఈ బరువును తనపై మోపుకుని, తన ఆత్మకు అన్యాయం చేసుకున్నాడు. ఈ బరువు బాధ్యత మూలంగా తనపై పడే అదనపు భారాన్ని, జాగ్రత్తలను విస్మరించి తన మూర్ఖత్వాన్ని చాటుకున్నాడు.

125. ఈ అమానతును మానవునికి అప్పజెప్పటం వెనుక ఓ ఉద్దేశం ఉంది. దీనిద్వారా కపటుల కపటాచారాన్ని, ముష్రిక్కుల షిర్కును దేవుడు బట్టబయలు చేయదలిచాడు. అలాగే విశ్వాసులలోని విశ్వాసాన్ని కూడా నిగ్గుతేల్చి తదనుగుణంగా పుణ్యఫలం ప్రసాదించదలిచాడు.